



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 313 | ది. 25-2-2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 313 | Date : 25-2-2026 | Wednesday | Pages : 8 | Rs.1/- |







## మార్కాపురానికి జిల్లా కళ - వెలిగొండతో జలకళ
## హార్టికల్చర్‌తో రైతు జీవితాలు కళకళ




ఎన్నికల్లో మాటిచ్చినట్లు మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసి... ప్రజల 5 దశాబ్దాల కలను నెరవేర్చాం.
ఈ ఏడాదే వెలిగొండ మొదటి ఫేజ్ పూర్తి చేసి కరువు ప్రాంతంలో జలకళ తెస్తాం.
హార్టికల్చర్ సాగుతో రైతుల జీవితాల్లో వెలుగులు నింపి జీవన ప్రమాణాలు పెంచుతాం.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

**గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిచే**

**నేడు రూ.456 కోట్లతో చేపడుతున్న వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు శంకుస్థాపన కార్యక్రమం**

**స్థలం :** గంటావానిపల్లె, పెద్దదోర్నాల మండలం | **సమయం :** ఉదయం 11 గంటలకు

### భారీ బహిరంగ సభ

**స్థలం :** మార్కాపురంలోని శ్రీ సాయి బాలాజీ మోడల్ స్కూల్ ఎదురుగా
**తేదీ :** 25-02-2026 | **సమయం :** మధ్యాహ్నం 2 గంటలకు

జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



## సాగునీరు సేద్యానికి జీవం... ఉద్యానవన పంట రైతుకు వరం

## పెడనలో అప్లికేషన్ డెవలపర్ వెబ్ & మొబైల్ కోర్స్ ఉచిత శిక్షణ



**పెడన,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** నాస్కామ్ చే గుర్తింపు పొందిన కేంద్ర ప్రభుత్వ శిక్షణ సంస్థ సహకారంతో రూపొందించిన "అప్లికేషన్ డెవలపర్ -- వెబ్ అండ్ మొబైల్" అనే ఆధునిక సాంకేతిక కోర్స్ ను మార్చి నెల నుండి పెడన స్కిల్ హబ్ లో ఉచితంగా ప్రారంభిస్తున్నట్లు శాసన సభ్యుని కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కోర్స్ ద్వారా యువతకు పరిశ్రమకు అవసరమైన వెబ్ & మొబైల్ అప్లికేషన్ డెవలప్మెంట్ నైపుణ్యాలు ప్రాయోగికంగా నేర్పిస్తారని ఏదైనా బి.టెక్, డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసిన యువత అధునాతన కోర్సుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లి సమయం, డబ్బు వృథా చేసుకోవాల్సిన అవసరం లేకుండా ఇవుడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న స్కిల్ హబ్ లో మార్చ్ 7 నుండి మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ అత్యాధునిక కోర్స్ లో శిక్షణ ను పూర్తిగా ఉచితంగా పొందే అవకాశం కల్పించబడింది. శిక్షణ అనంతరం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన సర్టిఫికెట్ ఉద్యోగ అవకాశాల కోసం సహకారం అందించనున్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని, తమ భవిష్యత్తును బలోపేతం చేసుకోవాలని మరింత సమాచారం కోసం సంస్థ కోఆర్డినేటర్: బాబు వంగ 88977 72488 నంబర్ లో సంప్రదించాలని శాసన సభ్యుని కార్యాలయం కోరింది.

## సహకార ఉద్యోగుల నిరసన దీక్ష



**చల్లపల్లి/అవనిగడ్డ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** న్యాయబద్ధమైన తమ డిమాండ్ల సాధన కోసం జెఏసి పిలుపు మేరకు వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు నిరసన దీక్ష చేపట్టారు.దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గత ఏడాది డిసెంబర్ 6 నుండి వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేసిన సహకార ఉద్యోగులు తమ ఆందోళనను ఉధృతం చేస్తూ ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మె బాట పట్టారు.సమ్మె కొనసాగింపులో భాగంగా తొమ్మిదో రోజైన మంగళవారం చల్లపల్లి కెడిసిసి బ్యాంకు శాఖ వద్ద నిరసన దీక్ష చేపట్టారు.ఈ నిరసన దీక్షలో అవనిగడ్డ డివిజన్ పరిధిలోని చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల, అవనిగడ్డ నాగాయలంక, కోడూరు మండలాలకు చెందిన వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.సహకార ఉద్యోగుల నిరసన దీక్ష శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా కొనసాగుతోంది.

## డెమో ప్రసాద్ రాజుకి డీడీగా పదోన్నతి



**కాకినాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా డెమో (డిస్ట్రిక్ట్ ఎక్స్టెన్షన్ మీడియా ఆఫీసర్సు ) సీహెచ్‌విడివి ప్రసాద్ రాజుకి రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు (జిఓఆర్టి నెం183) జారీ చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో డెమోగా పనిచేసిన ఆయన జిల్లాల విభజనలో భాగంగా అంబేద్కర్ కోనసీమకు బదిలీ అయ్యారు.వైద్య ఆరోగ్య శాఖ మాస్ ఎడ్యుకేషన్, మీడియా విభాగంలో సీనియారిటీ ప్రాతిపదికన ఆయన అర్హత పొందారు. కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య పరమైన అవగాహణ పెంపొందించేందుకు విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాల్సి ఉంటుంది. 1 జనవరి 2026 నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉండగా,డెమో సీహెచ్‌విడివి ప్రసాద్ రాజుకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

## కాకినాడలో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ



**కాకినాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** కాకినాడ నగరంలో వీధి కుక్కల పెరుగుతున్న సంతతిని నియంత్రించేందుకు యానిమల్ బర్త్ కంట్రోల్ (ఆదీజ) ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలను మరింత వేగవంతం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మంగళవారం దుమ్ములపేట ప్రాంతంలో పర్యటించిన కమిషనర్, వీధి కుక్కలను పట్టుకునే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రత్యేక బృందాల ద్వారా కుక్కలను సురక్షితంగా పట్టుకొని, ఏబిసి కేంద్రాలకు తరలించే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని వివిధ ప్రాంతాల నుండి అందుతున్న ఫిర్యాదుల మేరకు వీధి కుక్కలకు ఎబిసి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం కుక్కలను ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాత తిరిగి వాటి స్వస్థల ప్రాంతాల్లోనే విడిచిపెడతామని వివరించారు. అదేవిధంగా అగ్రెసివ్‌గా ప్రవర్తిస్తున్న వీధి కుక్కలను డాగ్ షెల్టర్లలో ఉంచి ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, డిఈఈ ప్రవీణ్, టిపిఎస్ రామ్మోహన్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఎం ప్రసాద్, మేస్త్రీ సత్తిబాబు, స్థానిక నాయకులు మూగరాజు, మోసయేసబ్, దాసరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాపార వేత్తలపై అవగాహన ఉండాలి

-రాంప్ సంబంధించిన పుస్తకాలు పంపిణీ





**పిఠాపురం,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** విద్యార్థులు పారిశ్రామిక వ్యాపార వేత్తల గురించి అవగాహన కలిగి ఉండాలని పిఠాపురం సి.బి.ఆర్ డిగ్రీ కాలేజీ చైర్మన్ చక్రవర్తుల సూర్యారావు ఆకాంక్షించారు. రైసింగ్ అండ్ ఆక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ కార్యక్రమంలో భాగంగా 20 రోజుల ఎంటర్ప్రెన్యూర్షిప్ కమ్ స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఎంటర్ప్రెన్యూర్షిప్ స్కిల్ అభివృద్ధి చేసే దిశగా కార్యక్రమాన్ని రూపొందించి నట్లు చెప్పారు. విద్యార్థులు కూడా ఆసక్తితో నేర్చుకుంటున్నారని, 20 రోజులు కొనసాగుతుందని, ఇటువంటి అవకాశాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ చక్రవర్తుల ఆకాంక్షించారు. విద్యార్థులకు రైసింగ్ అండ్ ఆక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫా ర్మెన్స్(రాంప్) సంబంధించిన పుస్తకాలు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. రాబోవు రోజులలో మరి కొంత మంది విద్యార్థులతో కొత్త బ్యాచ్ లు కూడా ప్రారంభం అవుతాయన్నారు. ఈ అవకాశాన్ని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సలగల రాజశేఖర్ బాబు బాపట్ల జిల్లా అధ్యక్ష స్థానం నుంచి తొలగించాలి



**బాపట్ల, ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** సలగల రాజశేఖర్ బాబును బాపట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవి నుండి తొలగించాలని దళితిమీడియా ట్రస్ట్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు మూల్పూర్ మాణిక్యరావు తెలుగుదేశం పార్టీ అధినాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. బాపట్ల పార్లమెంట్ సభ్యులు లోక్సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్ కు పార్టీలోనూ,ప్రజలలోను వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఆయనను కించి పరుస్తూ తన అనుచరులు చేత జిల్లా అగ్ర నాయకుల సమావేశంలో మాట్లాడించారు. ఆదివారం బాపట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు.అదే కార్యక్రమంలో నూతనంగా ఎన్నిక కాబడిన తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యవర్గం ప్రమాణస్వీకారం జరిగింది . ఈ కార్యక్రమానికి సభ అధ్యక్ష స్థానం వహించవలసిన సలగల రాజశేఖర్ బాబు తన అనుచరుడుకు గొల్లపూడి సుబ్బారావుకు అధ్యక్ష స్థానం ఇచ్చి ఆయన చేత బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ ను కించపరిచే విధంగా మాట్లాడించారు. అధ్యక్ష స్థానంలో ఉన్న సుబ్బారావు ఎంపీకి రాజకీయ అవగాహన లేదని రాజకీయము నేర్చుకోవాలి అని మాట్లాడితే కనీసం ఖండించలేదు. దీనిని బట్టి సలగల రాజశేఖర్ జిల్లాలో వివాదాలకు తెర తీస్తున్నాడని ఇటువంటి వ్యక్తి పార్టీ అధ్యక్ష స్థానంలో ఉంటం పార్టీకే మంచిది కాదని మాణిక్యరావు చెప్పారు. సభలో మాట్లాడిన సుబ్బారావుకు నష్టం లేదు, జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్ బాబుకి నష్టం లేదు కానీ పార్టీకి నష్టం జరుగుతుంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ వయసులో కూడా ప్రజలకు మేలు చేయాలి, పార్టీ కార్యకర్తలకు మేలు చేయాలి, రాష్ట్రాన్ని అభివృద్ధి పరచాలని అవిశ్రాంతంగా కృషి చేస్తుంటే సలగల రాజశేఖర్ మాత్రం రాజకీయం చేస్తున్నాడు. ఏ రాజకీయ అనుభవం లేకుండానే బాపట్ల పార్లమెంట్ సభ్యునిగా సీటు తీసుకున్నారా? పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికయ్యారా? లోక్సభ ప్యానల్ స్పీకర్ గా సభను విజయవంతంగా నడిపిస్తున్నారా? బాపట్ల జిల్లాలో మునుపెన్నడూ జరగ నటువంటి ఎవరి ఊహలకు అందనటువంటి అభివృద్ధి పనులను చేపట్టి కేంద్రం నుండి గ్రాంట్లు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తుంటే ఇదంతా మీకు కనపడటం లేదా? రాజకీయ అనుభవం లేదని చెప్పినటువంటి సుబ్బారావు అనుభవం ఎంత? ఇటువంటి మాటలు మాట్లాడేవాడు గాని, మాట్లాడించేవాడు గాని , ఒకసారి ఆలోచించాలి ఈ విధంగా పార్టీకి నష్టం జరిగే విధంగా మాట్లాడుతున్నా వీరిని ఆ పదవుల నుంచి తొలగించాలని దళితులు కోరుకుంటున్నార ని మూల్పూర్ మాణిక్యరావు చెప్పారు.

## గ్రామపంచాయతీలలో విచ్చలవిడిగా అనధికారిక లేఔట్లను వేస్తున్న పట్టించుకోని కాకినాడ జిల్లా ప్రథమ ఉద్యోగి బదిలీ ఎప్పుడు ?

● ఇన్చార్జి పాలనలో అవగాహన లేని జిల్లా పంచాయతీ అధికారి? ● జీతం ఒకచోట పనిచేసేది మరోచోట ప్రశ్నించేది ఎవరు?



**కాకినాడ రూరల్,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీల వ్యవస్థను పంచాయతీరాజ్ మంత్రి పవన్ కళ్యాణ్ గాడిలో పెట్టడానికి ప్రయత్నాలు చేస్తుంటే ఎవరైతే నాకేటి మా వాటాలు మాకు వస్తే చాలు అన్నట్లు కాకినాడ రూరల్ మండలంలో పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది ఏకమై గ్రామ పంచాయతీలకు రావలసిన కన్వర్షన్ ఫీజులను రాకుండా అనధికారిక లేఔట్లకు మద్దతు పలుకుతున్నారు. కాకినాడ రూరల్ మండలం లో భూ యజమాని కన్వర్షన్ లేకుండా భూమిని పూడ్చిపెట్టే సమయంలో అధిక లోడుతో ఉన్న లారీ చేలో దిగిపోవడంతో లారీ పడిపోవడం జరిగింది కొంచెం ఉంటే ప్రక్కనే ఉన్న కాలువలోకి లారీ తిరగబడిపోయేది అదృష్టవశాత్తు లారీకు కొంత గ్రావెల్ సపోర్టుతో నిలబడుట వలన కొద్ది నిమిషాలు లారీ లోనే డ్రైవర్ ఉండి క్షేమంగా బయటకు రావడం జరిగింది. ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగితే డ్రైవర్ కు ఎవరు బాధ్యత వహిస్తారు? ప్రమాదం జరిగే సమయంలో అక్కడే ఉన్న పంచాయితీ మరియు రెవెన్యూ సిబ్బంది నీ కన్వర్షన్ లేని స్థలాలను కప్పుడుతుంటే మీరు ఏం చేస్తున్నారని తూరంగి మాజీ ఎంపిటిసి పితాని వెంకట రాము ప్రశ్నించడం జరిగింది. అదే సమయంలో వారికి ఫోను రాగా వెనువెంటనే సిబ్బంది అక్కడ నుంచి వెళ్లిపోవడం జరిగింది. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయలతో పనులు చేస్తుంటే పంచాయతీరాజ్ మంత్రి గ్రామాలు బాగుపడాలని ఎంత మొత్తుకున్నా జిల్లా అధికారులు సక్రమంగా పనిచేయనంత కాలం ఏ ప్రభుత్వం వచ్చినా ఏ నాయకుడు వచ్చిన ఇంతే?

## రక్తదానం చేసిన వారు ప్రాణదాతలు



**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** మనం దానం చేసిన రక్తం వేరొకరి ప్రాణం నిలబెడుతుందని రక్త దానం చేసిన మీరు ప్రాణ దాతలు కావాలని దీపక్ నెక్స్ జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎం డి అడుసుమిల్లి వెంకట సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం బొమ్ములూరు దీపక్ నెక్స్ జెన్ ఫీడ్స్ లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఏలూరు పర్యవేక్షణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ ఎం బి ఎస్ వి ప్రసాద్, కే వి రమణ పర్యవేక్షణలో రక్తదాన శిబిరం నిర్వహించారు..ఈశిభిరం లో ఫ్యాక్టరీ సిబ్బంది,కార్మికులు స్వచ్ఛందంగా 50 యూనిట్లు రక్తం అందించారు.ఈ కార్యక్రమంలో నెక్స్ జెన్ డైరెక్టర్స్ అడుసుమిల్లి చైతన్య వాసు, అప్పారావు ,రాజశేఖర్ , మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఏలూరుశాఖ సభ్యులు, నెక్స్ జెన్ హెచ్ అర్ లు రాజేంద్ర ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముంజులూరు లో విద్యార్థినులకు క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం...

**కృత్తివెన్ను,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ హైస్కూల్ ముంజులూరులో మంగళవారం విద్యార్థులకు క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వము ద్వారా 14 సంవత్సరముల వయస్సు ఉన్న ఆడపిల్లలు అందరకు ఉచితముగా హెచ్ పి వి వాక్సిన్ వేయబోవుచున్నారు. గనుక అందరూ ఈ అవకాశన్ని (14ఇయర్స్ ఫిమేల్స్ )వినియోగించుకోవాలని. తద్వారా సర్వికల్ క్యాన్సర్ ముప్పు తప్పించుకుంటారు అనియు కాన్సర్ ఈ రోజుల్లో ప్లాస్టిక్ వినియోగం, ఫిజికల్ శ్రమ లేకపోవటం జంక్ ఫుడ్,ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం ఓబేసిటీ పెర్సొనెల్ హైజిన్ లేకపోవటం, ఫ్యామిలీ చరిత్రలో క్యాన్సర్ వచ్చి ఉండటం వంటి పలు అంశాలు ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు.

## పేద, మధ్యతరగతికి మెడికవర్ వైద్య పరీక్షలు




**కాకినాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ప్రస్తుతం ఉన్న కాలంలో ప్రతివారికి వైద్య సేవలు ముఖ్యం అటువంటి వైద్య సేవలు పేద మధ్యతరగతి వారికి కూడా అందుబాటులోకి తేవాలని ఉద్దేశంతో కాకినాడ ఏడిబి రోడ్లోని మెడికవర్ ఆసుపత్రిలో అతి తక్కువ ధరలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఉద్దేశంతో ఈ ప్రత్యేక సదుపాయం ఏర్పాటు చేశామని హాస్పటల్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి నందికోళ్ల అంజిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, కుందల సాయికుమార్, కాళ్ల ధనరాజు, తుమ్మలపల్లి నాని, మారే బుజ్జి తదితరులు ఈ వైద్య పరీక్షల గురించి పోస్టర్ను ఆవిష్కరించారు.

## బంటుమిల్లి లో అంగన్వాడీ వర్కర్స్ రిలే నిరాహార దీక్ష...



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** బంటుమిల్లి ఐసిడిఎస్ ఆఫీసు ముందు అంగన్వాడి టీచర్లు రిలే నిరాహార దీక్షలో పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ మాజేటి శివ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కనీస వేతనం అమలు చేయాలని అర్హులైన అంగన్వాడీలకు సూపర్వైజర్లుగా ప్రమోషన్ తదితరు డిమాండ్ల పరిష్కారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈరోజు ఈ శిబిరానికి రైతు సంఘం మండల కార్యదర్శి లంకదాసు అజయ్ గోష్ పాల్గొని సంఘీభావం తెలియజేశారు....

## క్రికెట్ పోటీలలో విజయాభేరి మోగించిన శ్రీవాణి కళాశాల విద్యార్థులు



**జి.కొండూరు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** విజయవాడ సిద్ధార్థ కళాశాలలో జరిగిన స్పోర్ట్స్ ఫెస్ట్ (క్రికెట్ పోటీలు)లో జి.కొండూరు మండల పరిధిలోని చెవుటూరు శ్రీవాణి కళాశాల విద్యార్థులు విజయాభేరి మోగించారు.ఈ క్రికెట్ పోటీలలో మొత్తం 22 జట్లు పాల్గొనగా శ్రీవాణి కళాశాల జట్టు అత్యంత ప్రతిభ కనబరిచి ఫైనల్స్ కి చేరి విజేతగా నిలిచా రు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కొల్లి రవి కుమార్,ప్రిన్సిపాల్ నలిగల ఉషారాణి విద్యార్థు లను ప్రశంసించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని కొనియాడారు.

## ఉప సర్పంచ్ ఇంచార్జ్ సర్పంచ్ అయిన వేళ



**విస్సన్నపేట,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని తాతకుంట్ల గ్రామ సర్పంచ్ పి వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించడంతో పరిపాలన సౌలభ్యం కొరకు ఉప సర్పంచ్ మేడ మల్లయ్యకు అధికారిక ఇన్చార్జి బాధ్యతలు అప్పజెప్పినట్లు ఎంపీడీవో చిన్న రాట్నాలు తెలియజేశారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలతో 19వ తేదీ నుండి బాధ్యతలు అప్పచెప్పినట్లుగా చెప్పారు.

## రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**మైలవరం,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** స్థానిక మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం రేపు అనగా 26ఫిబ్రవరి 2026వ తేదీ గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.అనురాధ మంగళవారం ప్రకటనలో తెలిపారు.ఎంపీపీ ఇస్లావతు ప్రసన్న రాణి అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశం ఉదయం 10.00 గంటలకు ప్రారంభమవుతుం దని తెలిపారు.ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు,అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

## తిరువూరులో 9వ రోజుకు చేరిన సహకార సంఘాల ఉద్యోగుల నిరవధిక సమ్మె..




**తిరువూరు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** జీవో నెంబర్ 36 ను వెంటనే అమలు చేయాలని 2019 నుండి 2024వరకు పెండింగ్లో ఉన్న వేతన సవరణలు చేయాలని ఉద్యోగుల డిమాండ్.చట్ట ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని.. ఉద్యోగులకు 5లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమానుకల్పించాలన్నారు.2019 న తర్వాత సహకార సంఘాల చేరిన ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలి.అనేక ఏళ్ల నుంచి పెండింగ్లో ఉన్న డివిడెంట్ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసిన ఉద్యోగులు.

## మా వేతనాలు పెంచండి..



**తిరువూరు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** తిరువూరు రెవెన్యూ కార్యాలయం వద్ద సిఐటియూ ఆధ్వర్యంలో అంగన్వాడి వెల్ఫేర్లు రెండోరోజు రిలే నిరాహార దీక్షలు..అంగన్వాడీల వెల్ఫర్స్ వేతనాలను 26వేలకు పెంచాలని డిమాండ్..గ్రామీణ ప్రాంతాల్లో సంక్షేమ పథకాలు అందడం లేదంటూ అంగన్వాడి వెల్ఫేర్లు ఆందోళన..నెలకు ఇచ్చే 7000 జీతం చాలడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన అంగన్వాడి ఆయాలు..మార్చి 2వ తేదీన విజయవాడలో జరిగే మహాధర్నా కార్యక్రమంలో పాల్గొని.. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాంసిఐటియు జిల్లా జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు..

## శ్రీ అలివేలు మంగ గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఏకాదశ వార్షిక మహోత్సవ కార్యక్రమాలు చూతము రారండి



**విస్సన్నపేట,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని కలగర రామచంద్రపురం గ్రామంలో శ్రీ అలివేలుమంగ గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ ఉత్సవ మహోత్సవ సంబరాలను చూసేందుకు అశేష జనవాహిని తరలిరావాలని ఆలయ నిర్వాహకులు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 6 గంటలకు పుణ్యాహవాచనం యాగశాల ప్రవేశం నిత్య హోమం ఉదయం 9 గంటల నుండి అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణం ఉదయం 11 గంటల నుండి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం సాయంత్రం నాలుగు గంటలకు గరుడ వాహనంపై గ్రామోత్సవం ఆలయ బలిహరణ నిత్య హోమం పుణ్యాహవాచనం పంచగవ్య ప్రధాన నిత్య హోమం పూర్ణాహుతి చక్రస్థానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు అందుకోవాల్సిందిగా కోరారు. నైనానందకారంగా చూచిన చూడముచ్చటగా నభూతో నభవిష్యతి అన్న చందంగా వేలాది మంది సమక్షంలో తిరుమల తిరుపతి దేవస్థానం స్వామివారి కళ్యాణం నమూనాలో జరుగు కళ్యాణాన్ని వీక్షించేందుకు ఆహ్వానం పలుకుతున్నామని వారు చెప్పారు. ఖమ్మం, పశ్చిమగోదావరి ఏలూరు మధిర కృష్ణా జిల్లా తదితర ప్రాంత వాసులు కూడా తరలిరావడం ఆనవాయితీగా జరుగుతోందని తెలియజేశారు.





# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 313 | ది. 25-2-2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 313 | Date : 25-2-2026 | Wednesday | Pages : 8 | Rs.1/- |


# నాటి నుంచి హిందూమతంపై వ్యవస్థీకృత దాడి

- తిరుమల గిరులను కుదించారు... కల్తీతో అపవిత్రం చేశారు
- తిరుమల డిక్లరేషన్ పై జగన్ ధిక్కారం
- గత పాలనలో టీటీడీలో ఉద్దేశపూర్వకంగా అన్యమత ప్రచారం
- జరిగిన అపచారాలపై తీవ్రంగా స్పందించిన హైందవ మఠాలు
- కల్తీకి ఆస్కారం లేని విధంగా కఠినతరంగా నిబంధనలు
- హిందువుల మనోభావాలు కాపాడే బాధ్యత మాది
- కల్తీ నెయ్యి వ్యవహారంపై శాసనసభలో లఘు చర్చలో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- వైసీపీ హయాంలో మహాపాపం పేరిట సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సీఎం



**అమరావతి,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ఓ పద్ధతి ప్రకారమే 2005 నుంచి హిందూమతంపై దాడి జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తిరుమల పరిధిని ఏడు కొండల నుంచి రెండు కొండలకు మాత్రమే పరిమితం చేస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవో తీసుకువచ్చారని అప్పటి నుంచే హిందూ మతంపై క్రమబద్ధంగా దాడి చేస్తూ వచ్చారని ఆక్షేపించారు. అప్పటి పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శిగా ఉన్న శామ్యూల్ అనే క్రైస్తవ అధికారి ఈ జీవో జారీ చేశారని వివరించారు. హిందూ సమాజంతో పాటు రెండేళ్ల పాటు తాము చేసిన పోరాటాల కారణంగా వెనక్కు తగ్గారని సీఎం స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై శాసనసభలో చేపట్టిన లఘు చర్చలో భాగంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ వ్యవహారంపై మహాపాపం పేరిట అసెంబ్లీలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వైసీపీ హయాంలో 20.01 కోట్ల లడ్డూ ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో తయారు చేసి ఘోర అపచారం చేశారని ముఖ్యమంత్రి అన్నారు. రాజకీయ వివాదం ఉండకూడదని సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారులతో సిట్ ఏర్పాటైందని సీఎం వివరించారు. సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేసి విచారణ చేయాలని ఆదేశించినట్టు తెలిపారు. తప్పు చేసిన నిందితులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించిందని అన్నారు. అందుకే ఈ వ్యవహారంపై ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి తెలిపారు. లడ్డూ వ్యవహారంలో అనేక తప్పులు చేశారని సీఎం స్పష్టం చేశారు. 2019-24 మధ్య 59.71 లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగించారని అన్నారు. రూ. 231.51 కోట్ల అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనల్ని నీరుగార్చారని స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారం ఓ ప్రణాళిక ప్రకారం లాలూచీ పడిన లూటి అని స్పష్టంగా తేలిందన్నారు. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా... నివేదికలు వచ్చినా అప్పటి టీటీడీ ఛైర్మన్ దానిని తొక్కి పెట్టారని అన్నారు. లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని తానేమి సొంతగా చెప్పలేదని ఎన్డీడీబీ కాఫ్ ఇచ్చిన నివేదికనే బయటకు వెల్లడించానని అన్నారు.

**అప్పటి బోర్డుకు, ఛైర్మన్ కు తెలియకుండా తప్పులు జరిగాయా...?** కల్తీ నెయ్యి సరఫరాకు అనుగుణంగా టెండర్ నిబంధనల్ని సడలించారని.. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు సరఫరా చేయాలన్న నిబంధన తొలగించారని పేర్కొన్నారు. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని 3 ఏళ్ల నుంచి 1 ఏడాదికి కుదించారన్నారు. రోజుకు 12 టన్నుల వెన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని 8 టన్నులకు తగ్గించారని అన్నారు. అక్రమాలకు తెరతీసేలా డెయిరీల వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పరిమితం చేశారన్నారు. సాంకేతిక అధ్యయనం, ఫీల్డ్ విజిట్లకు పూర్తిగా మినహాయింపు ఇచ్చారని.. వీటితో పాటు ఫుడ్ సేఫ్టీ నిబంధనల్ని కూడా నీరుగార్చారన్నారు. ఈ కల్తీ నెయ్యి వ్యవహారంలో ప్రధాన సూత్రధారులుగా పోమిల్ జైన్ , విపిన్ జైన్ తో పాటు భోలే బాబా ఆర్గానిక్ డెయిరీ ఉందన్నారు. ఏఆర్, శ్రీవైష్ణవీ, మాల్ గంగా డెయిరీలు భోలే బాబా డెయిరీకి షెల్ కంపెనీలుగా వ్యవహరించి కల్తీ నెయ్యి సరఫరా చేశారని సీఎం స్పష్టం చేశారు. రూ.4.5 కోట్ల లంచం డబ్బుతో నాటి ఛైర్మన్ పీఏ చిన్నప్పన్న అడ్డంగా దొరికి పోయారని సీఎం తెలిపారు.

# వైసీపీ హయంలో 43,948 మంది అనర్హులకు ఇళ్ల పట్టాలు

- పరిశీలనలో ఇంకా 1,11,037 మంది లబ్దిదారులు
- పేదలకు ఇళ్ల పేరుతో దోచుకున్న జగన్ సర్కార్
- అందరికీ ఇళ్లు పథకం కింద కొత్తగా 4,08,876 దరఖాస్తుల రాక
- శాసనసభలో మంత్రి అనగాని సమాధానం



**అమరావతి,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** వైసీపీ పాలనా కాలంలో పేదలందరికీ ఇళ్లు పేరుతో 6 వేల కోట్ల రూపాయాల కుంభకోణాలకు పాల్పడ్డారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం శాసనసభలో టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ గత ప్రభుత్వం 22 లక్షల మంది ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తే అందులో 7 లక్షల మంది కన్వేయన్స్ డీడ్లే తీసుకోలేదన్నారు. ఇళ్ల పట్టాల కోసం నివాస యోగ్యం కాని పల్లపు భూములు, శశ్మానాలు, ఊరికి దూరంగా ఉండే భూములు, వర్షాలకు మునిగి పోయే భూములను రెండింతలు, మూడింతలు అధిక రేట్లు ఇచ్చి సేకరించరాని చెప్పారు. ఇళ్ల పట్టాలు నివాసయోగ్యంగా లేని కారణంగా రెండున్నర లక్షల మంది ఇళ్ల పట్టాలు తీసుకునేందుకు నిరాకరించారని తెలిపారు. ఇళ్ల పట్టాల పంపిణీలో అక్రమాలకు పాల్పడ్డారని, తమ ప్రభుత్వం విచారణ చేయించగా 43,948 మంది అనర్హులు తేలినట్లు చెప్పారు. పరిశీలనలో ఇంకా 1,11,037 లబ్దిదారులు ఉన్నారని తెలిపారు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అందరికీ ఇళ్లు పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అయితే గత ప్రభుత్వం సెంటున్నర, సెంటు మాత్రమే ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం మొత్తం 4,08,876 దరఖాస్తులు ఇళ్ల పట్టాల కోసం వచ్చాయని, ఇందులో 1,03,494 దరఖాస్తులను అమోదించగా 1,41,928 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. ఇంకా 1,56,454 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు.


## గ్రామ పంచాయితీ కార్యాలయం - పినపాక
## జి.కొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్.
### టెండరు ప్రకటన

**ఆర్.ఓ.సి.నెం : 278/2026** **తేది.25.02.2026.**

ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం, పినపాక గ్రామ పంచాయితీ నందు ఈ దిగువ నుదహరించిన పనులు కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించుటకు గాను ఒక సంవత్సరమునకు అనగా ది.01-04-2026 నుండి 31-03-2027 వరకు సీల్డు టెండర్లు గ్రామ పంచాయితీ కార్యాలయము నందు ది. 05-03-2026 మధ్యాహ్నం గం.12.00ల వరకు స్వీకరించబడును. అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షంలో పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు తెరువబడును. ఇతర వివరములు కొరకు కార్యాలయము పనివేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

| వ. సంఖ్య | పని పేరు | కాలము | టెండరు ధరావత్తు |
|---|---|---|---|
| 1) | పారిశుధ్య పనులు - 04 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | 4x500/- |
| 2) | ట్యాంకు ఆపరేటర్ - 01 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | 1x500/- |
| 3) | వీధి దీపముల రిపేరు (ఎలక్ట్రీషియన్) - 01 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | 1x500/- |

నోట్ :-
1. గతంలో గ్రామ పంచాయితీలో పని చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
2. పంచాయితీ నిధులు నిల్వలను బట్టి చెల్లింపులు చేయబడును.

**సం/- వేములకొండ వెంకటేశ్వరమ్మ**
**సర్పంచ్**
**గ్రామ పంచాయతీ, పినపాక**
**జి.కొండూరు మండలం.**

**సం/- తొర్లికొండ నారాయణరావు**
**కార్యదర్శి**
**గ్రామ పంచాయతీ, పినపాక**
**జి.కొండూరు మండలం.**


# నాన్న మీరే మా ధైర్యం



**విస్సన్నపేట,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** స్థానిక మండల ంలో నరసాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని నిర్వహిస్తున్న జి వెంకటేశ్వరరావు అకాల మరణంతో వారి ఇరు వురు కుమార్తెలు దహన సం స్కార కార్యక్రమాలు నిర్వహిం చారు. నాన్న అంటే ధైర్యం అని ఒక బిడ్డ అమెరికా వెళ్ళిన మరి ఒక బిడ్డ చెన్నై వెళ్ళినా మీ వెనుక నేనున్నానని భరోసా ఇచ్చి ఒకరిని ఫ్లైట్ ఎక్కించిన వేరొకరిని ట్రైన్ ఎక్కించిన అది ఆ నాన్నకే చెల్లిందని ఆయన లేరు తిరిగిరాని లోకానికి వెళ్లారు శివ ఐక్యం చెందారు అన్న మాట విన్న సమయంలో మహాసముద్రంలో తుఫానుకు దిక్కూచి జారిపోవడంతో ఏ దిక్కుకు వెళ్ళాలో తెలియని పరిస్థితిలో ఉన్న నావికుడు వలె తమ జీవితాలు అయినట్లు ఉన్నాయని అంటున్నారు. ఏది ఏమైనా పగవాడికి కూడా ఇలాంటి పరిస్థితి రాకూడదని అంతిమయాత్రలో పాల్గొన్న పలువురు నోట వినిపించింది.

# పెనుగంచిప్రోలు 108 సిబ్బందికి ప్రశంసలు...




**పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలో బిక్షాటన చేసే వృద్ధ మహిళ ని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్ట గా ఆమెకు గాయాలు అయి రోడ్డు పై పడిపోయిన ది, తనను చూసిన 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, ఎటువంటి సమాచారం లేకపోయినా అటుగా వెళ్తు చూసి వెంటనే ప్రథమ చికిత్స చేశారు,వీరు చేసిన పనిని చూసి గ్రామ ప్రజలు వీరికి ప్రశంసలు అందజేశారు.

# మా చిరకాల వాంఛ నెరవేర్చారు...

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉద్యోగ, పెన్షనర్ సంఘాల నేతల కృతజ్ఞతలు



**హైదరాబాద్,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** దశాబ్దాల తమ వాంఛను నెరవేర్చారంటూ ఉద్యోగ, పెన్షనర్ సంఘాల నేతలు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకూ రూ.1.20 కోట్ల ప్రమాద బీమా వర్తింపు, రూ.1,056 కోట్ల మూలనిధితో ఉద్యోగుల, పెన్షనర్ల ఆరోగ్య పథకానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసిన నేపథ్యంలో ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నేతలు, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య, బీమా పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని వారు కొనియాడారు. 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్సలను పొందే విధంగా ఉద్యోగులు, పెన్షనర్లకు అవకాశం లభించడం నిజంగా వరమని ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని క్యాబినెట్ ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న ఈ నిర్ణయాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిపోతాయని ఉద్యోగ సంఘాల నాయకులు కొనియాడారు. ముఖ్యమంత్రికి, మంత్రివర్గ సభ్యులకు ఉద్యోగ సంఘాల నేతలు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐకాస నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, పి.దామోదర్ రెడ్డి (పీఆర్‌టీయూ), చావా రవి (యూటీఎఫ్), కే.వెంకటేశ్వర్లు (టీఎన్జీవో), ఉపేందర్ రెడ్డి (టీజీవో), జి.సదానందగౌడ్ (ఎస్టీయూ), దామోదర్ రెడ్డి, ఉమాదేవి (పెన్షనర్స్), వి.రవీందర్ రెడ్డి (రెవెన్యూ), గిరి శ్రీనివాస్ రెడ్డి (సెక్రటేరియట్), ఖాదర్ (ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్), టి.లక్ష్మన్ (ఎక్సైజ్), తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి , కె.రామకృష్ణ (డిప్యూటీ కలెక్టర్ల సంఘం), ఎస్.రాములు, రమేష్ పాక, సీహెచ్.శ్రీనివాస్ (తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్), బాణాల రాంరెడ్డి, వి.భిక్షం (తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్), డా.నిర్మల, ఎల్.దశరథ్(టీజీసీపీఎస్ఈయూ), గరికె ఉపేందర్‌రావు (జీపీవో), సుగంధిని (హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌డబ్ల్యూ), భూమేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పాలనలో అన్ని శాఖలకు తాళాలు వేశారు

- గత ఐదేళ్లు రాష్ట్రం అస్తవ్యస్తంగా మారింది
- పశుసంవర్ధక శాఖను నిర్వీర్యం చేసిన వైసీపీ
- పశువైద్యశాలలు పేరుకే మిగిలాయి, మందులు,పరికరాలు లేవు ,సిబ్బంది లేరు
- కూటమి ప్రభుత్వం వచ్చాకే పశు సంవర్ధక శాఖ పునరుజ్జీవనానికి చర్యలు : వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని శాఖలకు తాళాలు వేసిన పరిస్థితి నెలకొందని, ముఖ్యంగా పశుసంవర్ధక శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసి అభివృద్ధిని కుంటుపెట్టారని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం అసెంబ్లీలో తీవ్ర విమర్శలు చేశారు. శాసనసభలో ఎమ్మెల్యేలు పశు వైద్యశాలల్లో సౌకర్యాల కొరత, వైద్యుల నియామకాలపై అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైసీపీ హయాంలో పశుసంవర్ధక శాఖలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, రైతులు, పశుపాలకులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కూడా అందించలేని దుస్థితి ఏర్పడిందని మంత్రి తెలిపారు. పశువుల చికిత్సకు అవసరమైన మందులు లేవు, ఆధునిక పరికరాలు లేవు, ఉన్న భవనాలు శిథిలావస్థలో ఉండగా, వాటిని చూసుకునే సిబ్బంది కూడా లేకుండా శాఖను నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో పశు సంవర్ధక శాఖ ద్వారా మొత్తం 3176 కేంద్రాలు పనిచేస్తున్నప్పటికీ, గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వీటిలో చాలా కేంద్రాలు పేరుకే పరిమితమయ్యాయని మంత్రి పేర్కొన్నారు. రైతుల విరాళాలతో నిర్మించిన పాత భవనాలను కూడా సంరక్షించలేక, వాటిని శిథిలావస్థకు నెట్టారని ఆరోపించారు. వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు పశు సంవర్ధక శాఖకు నిధులు కేటాయించకుండా, మౌలిక సదుపాయాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, ఫలితంగా పశువైద్యశాలలు మందుల్లేక, సిబ్బంది లేక, రైతులకు ఉపయోగపడని పరిస్థితిలోకి వెళ్లాయని మంత్రి అన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యోగ జెఎసి

- కాకినాడ జిల్లా జెఎసి చైర్మన్ గా జి. రామ్మోహన్, ప్రధాన కార్యదర్శిగా కెవివి నగేష్




**కాకినాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ కమిటీ ని పునర్వ్యస్థీకరించుకోవడం ద్వారా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని ఏపీ ఎన్జీవో కాకినాడ జిల్లా అధ్యక్షులు గుద్దటి రామ్మోహన రావు అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ కమిటీ (జెఎసి) లో అనుబంధ సంఘాలైన వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగ సంఘాల నాయకులతో కాకినాడ ఎన్జివో హోం నందు ఏపీ ఎన్జీవో కాకినాడ జిల్లా అధ్యక్షులు గుద్దటి రామ్మోహన రావు ఈ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ఏపీ ఎన్జీవో సంఘానికి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐకాస సహకారం ఎంతో అవసరం అని చెప్పారు. జెఏసి ని పునర్వ్యవస్థీకరించిఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఎపి ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ ఏపీ జెఏసి రాష్ట్ర చైర్మన్ గా ఎన్నికైన వెంటనే రాష్ట్రం లోని అన్ని జిల్లాలు, తాలూకాలలో జెఏసి ని పునర్వ్యవస్తికరించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడంతో జే ఎ సి మరింత పటిష్టమైందని అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగ సంఘాల జిల్లా తాలూకా స్థాయి నాయకులూ జే ఏ సి గొడుగు కిందకు చేరుకొని సమైక్యంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. అనంతరం కాకినాడ జిల్లా నూతన జే ఏ సి కమిటీ చైర్మన్ గా గుద్దటి రామమోహనరావు, జిల్లా జే ఎ సి కార్యదర్శిగా కాకినాడ యుటిఎఫ్ అధ్యక్షులు కెవివి.నాగేశ్వర రావు (నగేష్), కొ-చైర్మెన్ పోస్టులకు ఆర్టీసీ నుండి కెఎస్ రావు పిఆర్టియు నుండి ప్రదీప్ , ట్రెజరి అసోసియేషన్ నుండి వి. శశికుమార్. జిల్లా పరిషత్ నుండి ఆర్ వి.రమేష్ , వైస్ చైర్మన్ లుగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నుండి పాలపర్తి మూర్తి బాబు, ఎస్టియు నుండి పి. రామకృష్ణ, పెన్షనర్ల అసోసియేషన్ నుండి ఎం. వీరభద్ర స్వామి, ఏపీటిఎఫ్ -257 నుండి కె ఎస్ సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా బిఆర్వి చౌదరి, ఆర్గనైజింగ్ సెక్రటరి గా మొండి రవికుమార్,జాయింట్ సెక్రటరిలుగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నుండి వై.పద్మ మీనాక్షి, టెక్నికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నుండి టి.దొరబాబు,సిపిఎస్ ఉద్యోగుల సంఘం నుండి భాషా, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ నుండి ఎన్ జి రత్న కుమార్, ల్యాబ్ టెక్నిషియన్స్ అసోసియేషన్ నుండి కె.శ్రీనివాస్, గ్రంధాలయ ఉద్యోగుల సంఘం నుండి జయకృష్ణ, గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం నుండి డి.యమ లను అలాగే వివిధ ఉద్యోగ సంఘాల నుండి 10 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో వివిధ ఉద్యోగ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్య వర్గం, కాకినాడ సిటీ కార్య వర్గం, మహిళా కార్యవర్గ సభ్యులు,మాజీ జిల్లా అధ్యక్షులు బూరిగా ఆశీర్వాదం పాల్గొని నూతనంగా ఎన్నికైన కాకినాడ జే ఎ సి కార్య వర్గానికి అభినందనలు తెలియ జేసారు. ఈ సమావేశంలో వివిధ ఉద్యోగా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రెండో రోజు కొనసాగిన అంగన్వాడీ ల రిలే నిరాహార దీక్షలు

- వేతనాలు పెంచుతూ జీవో విడుదల చేయకపోతే అసెంబ్లీ ముట్టడి చేస్తాం
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్. సుధాకర్



**మైలవరం,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** వేతనాలు పెంచాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు (ఆయాలు)చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండవ రోజు కొనసాగాయి.అందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట మంగళవారం రెండవ రోజు అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటి యు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్దల తీరు అంగన్వాడీ ల పట్ల అత్యంత సులకనభావంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్లు పంపిణీలో అంగన్వాడీలు ఉన్నారనీ, అనేక సంక్షేమ పథకాలకు సంబంధించి సర్వేలు, బిఎల్ఓ డ్యూటీ లంటూ వారిచేత వెట్టి చాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వానికి అంగన్వాడీ కార్యకర్తలు జీతాలు పెంచడానికి ఎందుకు చేతులు రావడంలేదని ప్రశ్నించారు.రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయిస్తూ, జీతాలు పెంచుతూ జీవో విడుదల చేయకపోతే అంగన్వాడీలు రాష్ట్ర అసెంబ్లీని ముట్టడిస్తారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మైలవరం ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఆర్ ఆర్ వి పుష్ప కుమారి, సిహెచ్ శారద, సరోజిని, ఉష, అపర్ణ, కవిత, తదితరుల పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## మోడీతో ఢీ కొట్టాల్సిన కాంగ్రెస్ కి కష్టాలేంటి ?

కేంద్రంలో మూడు సార్లు వరసగా ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. స్వాతంత్రం వచ్చాక ప్రతిపక్షం ఇలా వరసబెట్టి ఇన్ని సార్లు గెలవడం ఒక రికార్డు. అంతే ఒకాదు విపక్షానికి చెందిన ఒకే ప్రధాని సుదీర్ఘంగా కొనసాగడం మరో చరిత్ర. దేశంలో ప్రజాభిప్రాయం అంతా ఒకే వైపుగా మార్చుకోవడం 140 ఏళ్ల కాంగ్రెస్ ని ఎన్నడూ లేని విధంగా కూసాలు కదిలించేలా చేయడం అన్నది కూడా హిస్టరీయే అని అంటారు రాజకీయ విశ్లేషకులు. అయితే ఎల్లకాలం ఒకే కాలం ఉండదు అని కూడా అంటారు. అలా కాంగ్రెస్ కి ఎంత చెడ్డా దేశమంతా తెలిసిన పార్టీ కాబట్టి మెల్లగా కోలుకుంటే పుంజుకుంటే ఈ రోజు కాకపోయినా రేపు అయినా రాజకీయ ఫేట్ మారుతుందని అనే వారూ ఉన్నారు. బలంగా ఎన్డీయే : ఇదిలా ఉంటే బీజేపీ ఒక పార్టీగా పటిష్టంగా ఉంది. దానికి నరేంద్ర మోడీ, అమిత్ షా వంటి దిగ్గజ నాయకులు వ్యూహకర్తలుగా ఉన్నారు. ఇక ఆర్ఎస్ఎస్ గ్రౌండ్ లెవెల్ లో బీజేపీకి సానుకూల వాతావరణం ఏర్పాటు అయ్యేలా చూస్తుంది. క్రమశిక్షణ కలిగిన నాయకులు కార్యకర్తలు బీజేపీకి వరం. అలాగే మోడీ ఇమేజ్ కూడా ఒక బ్రహ్మాస్త్రం. ఇక దేశంలో హిందూత్వ మీద మక్కువ పెరగడం అంతర్గత బహిర్గత పరిణామాలు సైతం బీజేపీకి కలసి వస్తున్నాయి. ఇది జాతీయంగా చూస్తే ఒక రాజకీయ సన్నివేశం. మరి ఈ పరిస్థితుల్లో బీజేపీని కేంద్ర పీఠం నుంచి కదల్చాలీ అంటే కాంగ్రెస్ కి ఎంతటి వ్యూహం ఉండాలి, మరెంతటి కఠోరమైన పరిశ్రమ ఉండాలి అన్నదే కదా అందరి మాట. మరి ఈ రోజున చూస్తే కాంగ్రెస్ పరిస్థితి దేశంలో ఏమిటి అంటే జవాబు అసంతృప్తిగా ఉంది. కేవలం మూడే రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారంలో ఉంది తెలంగాణా కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్. ఇందులో హిమాచల్ ప్రదేశ్ లో అప్పుల కుప్పగా మారి జనంలో అసంతృప్తి పెంచుకుంది బీజేపీ. పైగా అక్కడ పార్టీలో పోరు ఉంది. కర్ణాటకలో 2023లో గెలిచింది కానీ ముఖ్యమంత్రిత్వం మార్పు మీద డీకే శివకుమార్ సిద్ధరామయ్యల మధ్యన పోరు సాగుతోంది అని అంటున్నారు. ఇక ఈ ఏడాదిలో జరగనున్న అస్సాం, పశ్చిమ బెంగాల్ తమిళనాడు, కేరళలలో కాంగ్రెస్ పరిస్థితి బాగా లేదు అని అంటున్నారు. అన్ని చోట్ల విభేదాలు కుమ్ములాటలతో ఖద్దరు పార్టీ సతమతం అవుతోంది. అస్సాం లో ఇప్పటికే సీనియర్ నేతలు రాజీనామా బాట పడుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నా విభేదాలు అయితే అక్కడ ఆగడం లేదు, బెంగాల్ లో అయితే గత అయిదు దశాబ్దాలుగా అధికారంలో కాంగ్రెస్ లేదు, అయినా అక్కడ కూడా వర్గ విభేదాలు తారస్థాయిలో ఉనాయి. తమిళనాడ్లో అయితే డీఎంకే ఇచ్చే సీట్లను తీసుకోవడం తప్ప డిమాండ్ చేసే సీన్ అయితే కాంగ్రెస్ కి లేదు, కేరళలో చూస్తే రెండు సార్లు వామపక్ష కూటమికి అధికారం అప్పగించిన కాంగ్రెస్ ఈసారి కూడా గెలిచేందుకు తగిన ప్రయత్నాలు అయితే చేయడం లేదని అంటున్నారు. అక్కడ కూడా కుమ్ములాటలు పీక్స్ లో ఉన్నాయని చెబుతున్నారు. ఇదే విధంగా జార్ఖండ్ లోనూ అధికార జార్ఖండ్ ముక్తీ మోర్చాతో విభేదాలు ఉన్నాయని చెబుతున్నారు. బీహార్ లో లేటెస్ట్ ఓటమితో పార్టీ నేతలు రాజీనామాలు చేస్తున్నారు, ఉత్తరప్రదేశ్, గుజరాత్ లాంటి చోట్ల దశాబ్దాలుగా కాంగ్రెస్ ఉనికిలో పెద్దగా లేదని అంటున్నారు. ఏపీలో చూస్తే కాంగ్రెస్ కనీసంగా కూడా కనిపించడం లేదు అన్నది తెలిసిందే. ఇంతలా కాంగ్రెస్ చతికిల పడుతూ మోడీతో ఢీ ఎలా కొడుతుందనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ తన వ్యూహాలను మార్చుకోవాలని గట్టి నాయకత్వం అందించేలా చూసుకోవాలని అంటున్నారు.

## నేత్ర పర్వంగా శ్రీ రాజరాజేశ్వరి సమేత రాజరాజేశ్వర కల్యాణం....



గుడ్లవల్లేరు:ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)మండలంలోని పెసరమిల్లిలో శ్రీ రాజరాజేశ్వరి సమేత రాజరాజేశ్వర స్వామివారి ఆలయ ప్రధమ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్వామివార్ల కల్యాణం నేత్ర పర్వంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు భక్తిప్రపత్తులతో కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రాజరాజేశ్వర స్వామివారి ఆలయంతో పాటు శ్రీ సాయిబాబా వారి ఆలయం, నవగ్రహ మండపం, నాగబంధ ఆలయాల వార్షికోత్సవాల్ని మూడు రోజుల పాటు నిర్వహించారు. మంగళవారం వార్షికోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నసమారాధనకు భక్తులు వేలాదిగా విచ్చేసి అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు గ్రమోత్సవాన్ని మేళతాళాలతో చేపట్టారు. స్వామివారికి మహిళా భక్తులు అడుగడుగునా పండ్లు, టెంకాయలను సమర్పించి బ్రహ్మరథం పట్టారు. ఈ వార్షికోత్సవ పూజల్లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు కమ్మిలి సాంబశివరావు, రాధిక దంపతులు, మాజీ డీఎస్పీ కమ్మిలి మాణిక్యాలరావు, జయలక్ష్మి దంపతులు, మురాల లక్ష్మయ్య, ఝాన్సీ దంపతులు, యద్ధనపూడి వరప్రసాద్, శ్యామల దంపతులు, కమ్మిలి రాధాకృష్ణ, జయలక్ష్మి దంపతులు పీటలపై కూర్చొన్నారు. గ్రామ ప్రముఖులు అల్లూరి లక్ష్మణరావు(శ్యామ్), పట్టపు సురేష్, అల్లూరి రాము, కమ్మిలి విజయకుమారి, అల్లూరి ఆదియ్యానాయుడు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## చిట్టి చిట్టి పిల్లలు




పిల్లలకు సంస్కారము
పెద్దల యెడల గౌరవము
నేర్పించాలి బ్రతుకులో
నాటాలోయ్! మనసులో
విలువైన క్రమశిక్షణ
బాలల్లో రావాలి
అనుదినము సంరక్షణ
తప్పకుండా చేయాలి
నింపాలోయ్! వారిలో
దేశభక్తి అమితంగా
తరమాలోయ్! నెలకున్న
పిరికితనం దూరంగా
చిన్నారులు ముత్యాలు
ఖరీదైన వజ్రాలు
వారుంటే ఇల స్వర్గము
అంతుకేని ఆనందము

**గద్వాల సోమన్న**
-గణితోపాధ్యాయుడు
ఎమ్మిగనూరు,సెల్:9966414580

# విజయవాడ నగరాభివృద్ధి పై ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని ) సమీక్ష సమావేశం




**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాథ్ (చిన్ని), కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నగరాభివృద్ధిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ వర్షాకాలం దృశ్య, నగరంలో వర్షపు నీరు రోడ్డుపైన నిల్వ ఉండకుండా స్ట్రాంమ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు విజయవాడ నగర పాలక సంస్థ వారు తయారుచేసిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) సమీక్షించారు. అందులో భాగంగా ప్రస్తుతం పంట కాలువ డ్రైన్ 2.5 మీటర్లు ఉండగా ప్రస్తుత డిపిఆర్ ప్రకారం 8 మీటర్లకు వెడల్పు పెంచడం వల్ల వర్షపు నీరు నగరంలో నిలవ ఉండకుండా ప్రవహించేటట్టు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగరంలో ఇంకా ను వర్షపు నీటి డ్రైన్ ల నిర్మాణం ఎక్కడైతే అసంపూర్తిగా ఉన్నాయో వాటిని పూర్తి చేసేటట్టుగా, ముఖ్యంగా కొండ ప్రాంతాలలో వర్షపునీటి నిలువల సమస్య లేకుండా ఈ డ్రైన్లు నిర్మించే విధంగా డిపిఆర్ తయారు చేశామని అన్నారు. ముఖ్యంగా జక్కంపూడి, అంబాపురం, గొల్లపూడి, డ్రైన్లు నగర పరిధిలో ఎక్కడైనా కలుస్తుందా అన్న విషయాన్ని గమనించమన్నారు. నగరంలో అతి ముఖ్యమైన త్రాగునీరు మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు త్వరలో ఒక డి పి ఆర్ ని తయారు చేసి ఎంపీ గారికి ఇవ్వాలని అన్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు నగరంలోని ముఖ్యమైన పార్కులకు ఎంపీ నిధులతో మరింత అభివృద్ధి చేయాలని దానికి ఏ పార్కులకు ఎటువంటి అవసరాలు ఉన్నాయో ఒక నివేదికను సమర్పించాలని అన్నారు. వాడుకనీరును శుద్ధి చేసే మినీ సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు నగరంలో నిర్మించాలని అన్నారు. నగరంలో ఫుడ్ కోర్ట్ ల సంఖ్యను పెంచాలని కృష్ణలంక ప్రాంతంలో ఒక ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. నగర సుందరీకరణకు సర్కిళ్లు, ఐలాండ్ లు జంక్షన్లు అభివృద్ధి చేయాలని అన్నారు. నగరంలో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు దూరం చేసే విధంగా కొత్త బ్రిడ్జ్ లకు ప్రణాళికలు సిద్ధం చేయాలి అని అన్నారు. అందులో రైల్వే, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి సమన్వయంతో ప్రజల సమస్యలను తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ పార్కుల అభివృద్ధికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని, మంచినీటి పైప్లైన్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పై డి పి ఆర్ ను మార్చ్ నెలకల్లా అందిస్తామని, నగరంలో బ్రిడ్జి ల నిర్మాణ విషయంలో రైల్వే, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే శాఖల సమన్వయంతో నగరపాలక సంస్థకు భారం తగ్గుతుందని, కృష్ణలంక ప్రాంతంలో ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలనే ఆలోచన పై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, చీఫ్ ఇంజనీర్ (ఇంచార్జ్) పి.సత్యకుమారి, సూపర్ ఇండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) వి.చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె శ్రీనివాస్ ఏ శ్రీనివాసరెడ్డి జి సామ్రాజ్యం సురేఖ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# భారతీయ జనతాపార్టీ ఎన్టీఆర్ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

**రాహుల్ గాంధీ చిత్రపటానికి నిప్పు పెట్టిన నిరసన కారులు**






**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారతీయజనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ , ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ ఆదేశాల మేరకు.. భారతీయజనతాపార్టీ ఎన్టీఆర్ జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు ఎమ్ వి కే పద్మజ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం విజయవాడ పుష్ప హోటల్ సెంటర్ నుండి కొత్త వంతెన సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళామోర్చా నాయకురాళు ్ళ రాహుల్ గాంధీ చిత్రపటానికి నిప్పు పెట్టి,దేశద్రోహి రాహుల్ గాంధీ అంటూ పెద్ద ఎత్తున నినాధాలు చేసారు. ఈ కార్యక్రమంలో పద్మజ మీడియాతో మాట్లాడుతూ ఇండియా ఏ ఐ ఇంపాక్ట్ ఎక్స్పో-2026 ద్వారా ప్రపంచ సాంకేతిక రంగంలో భారతదేశ సత్తాను చాటే విధంగా ప్రపంచంలోని వివిధ దేశాల నేతలు, సాంకేతిక నిపుణులు హాజరైన సందర్భంగా రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ సభ్యులు గుండాల మాదిరిగా న్యూఢిల్లీలో సదస్సు జరిగే భారత్ మండపంలోకి అక్రమంగా చొరబడి దాడి చేసి ఉద్దేశపూర్వకంగా చొక్కాలు విప్పి రభస చేసి అర్ధనగ్నంగా ప్రదర్శనలు చేసి భారతదేశ ప్రతిష్టను దిగజార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని,రాహుల్ గాంధీని దోశద్రోహిగా పరిగణించి దేశ బహిష్కరణ చేయాలని ఈ సందర్బాంగా ఆమె డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శిబొడ్డు నాగలక్ష్మి,బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరి,బిజెపి రాష్ట్ర మహిళా మోర్చ కార్యదర్శి చిగురుపాటి లక్ష్మి,బిజెపి మహిళా మోర్చా కార్యాలయకార్యదర్శి మాధవి,బిజెపి రాష్ట్ర మహిళానాయకురాలు కరి నాగలక్ష్మి ,బిజెపి ఎన్టీఆర్ జిల్లా, మహిళా నాయకులు స్వాతిరావు,శాంతి,నాఖ బాజి మరియు బిజెపి నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

# రంజాన్ హలీం స్టాల్స్‌పై టౌన్ ప్లానింగ్ అధికారుల జులుం

● సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు ఆగ్రహం ● 35 ఏళ్ల సంప్రదాయాన్ని అడ్డుకుంటారా?
● అధికారుల అత్యుత్సాహం వెనుక మర్మమేమిటి?

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పంజా సెంటర్లో గత 35 ఏళ్లుగా ప్రతి ఏటా శాంతియుతంగా సాగుతున్న రంజాన్ హలీం స్టాల్స్‌ను తొలగించాలని ఈ సంవత్సరం టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు తీవ్రంగా మండిపడ్డారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ అధికారుల ఏకపక్ష వైఖరిని ఎండగట్టారు. ప్రతి ఏటా రంజాన్ మాసంలో కేవలం 30 రోజులు మాత్రమే ఇక్కడ హలీం స్టాల్స్ నిర్వహిస్తారని, కుల మతాలకు అతీతంగా విజయవాడ నగర ప్రజలు కుటుంబ సమేతంగా ఇక్కడికి వస్తుంటారని ఆయన గుర్తు చేశారు. అటువంటి ప్రదేశంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికే స్టాల్స్ నివాహనకు అన్ని ఏర్పాట్లు చేసుకొని కొన్ని స్టాల్స్ ఇప్పటికే ప్రారంభించగా ?అకస్మాత్తుగా ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం ఎంత వారికి సమంజసం అని ప్రశ్నించారు? ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా, రేపు ఉదయం కల్లా స్టాల్స్ తొలగించాలని హుకుం జారీ చేయడం అధికారుల అరాచక పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ఎన్నడూ లేని విధముగా ఈ సంవత్సరం నిబంధనల పేరుతో నోటీసులు ఇవ్వడం వెనుక ఉన్న మర్మమేంటని ఆయన నిలదీశారు. ఈ వ్యవహారంలో అధికారుల తీరు ?అనుమానాస్పదంగా ఉందని అయన అన్నారు గత 35 ఏళ్లుగా లేని నిబంధనలు ఇప్పుడు ఎక్కడ నుండి వచ్చాయని, స్థానిక ప్రజల జీవనోపాధిని, వారి పవిత్ర మాస వేడుకలను అధికారులు ఎందుకు అడ్డుకుంటున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు



పంజా సెంటర్ హలీం స్టాల్స్ నిర్వాహకులకు ఇచ్చిన నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, పవిత్ర రంజాన్ మాసంలో వారి మాత విశ్వాసాలను కాపాడుతూ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు సహకరించాలని కోరారు. అధికారులు తమ వైఖరి మార్చుకోకపోతే, పేద వ్యాపారుల పక్షాన, నగర ప్రజల పక్షాన సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని జి. కోటేశ్వరరావు హెచ్చరించారు.

# ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24(వార్తా ప్రభ ప్రతినిధి):**ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో లో ఎన్ ఎం యు ఏ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్టీసీ యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు తో మంగళవారం డిపో వద్ద భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. గేట్ మీటింగ్ నిర్వహించారు. 12 డిపోలలో ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలనే నిర్ణయంపై కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా ప్రెసిడెంట్ సిహెచ్ రామకృష్ణ,జిల్లా నాయకులు సుభాని, మాట్లాడుతూ విద్యాధరపురం వంటి కీలకమైన డిపోను పూర్తిస్థాయిలో ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడం అక్కడి సిబ్బందిని బలవంతంగా బదిలీ చేయడం అత్యంత అన్యాయం సంస్థను నష్టాల్లోకి నెట్టే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి ఆర్టీసీ ఆస్తులను కాపాడు కోవడానికి



ఎంతటి పోరాటానికైనా సిద్ధం అని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో డిపో అధ్యక్ష కార్యదర్సులు శ్రీనివాసరావు బీవీ ఆంజనేయులు డిపోపబ్లిసిటీ సెక్రటరీ మోహన్ గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్సులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా గళమెత్తిన ముఠా కార్మిక సంఘాలు!






**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్రంలో వర్తక,వ్యాపారలకు కేంద్రబిందువుగా ఉన్న విజయ వాడ పలు వ్యాపార సంస్థలలో ఎగుమతి, దిగుమతి మరియు తోలకం పనులు చేస్తున్న ముఠా కార్మికుల కూలిరేట్ల పెంపుదల కోరుతూ ముఠాకార్మిక సంఘం (ఏఐటీయూసీ) నగర కార్యదర్శి శ్రీరామ చంద్రమూర్తి అధ్యక్షతన విజయవాడ ముఠా కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ రోజు ఉదయం పాతబస్తీ సామారంగమ్ చౌక్ నుండి మెయిన్ బజార్, కందుల వారి వీధి, కెనాల్ రోడ్డు మీదుగా శంకర్ కేఫ్ వరకు ముఠాకార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు మాట్లాడుతూ విజయవాడలో ముఠాకార్మికుల కూలి రేట్లను ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పెరిగిన ధరలకు జీవన ప్రమాణాలకు అనుగుణంగా సవసరించే సంప్రదాయం ఉందని. కానీ ప్రస్తుతం కూలి రేట్లు పెంపుదలకు సంబందించిన గడువు పూర్తీ అయి ఆరు మాసాలు గడిచినప్పటికీ నేటి వరకు కూలి రేట్ల పెంపునకు సంబధించి వ్యాపార సంస్థల యాజమాన్యాలు గాని, వ్యాపార సంఘాలు గాని సంప్రదింపులు చేయకూడని తాత్సార వైఖరిని అవలంబిస్తున్నారని, గత నెలలో ముఠా కార్మిక సంఘాల ఐక్య వేదికగా వ్యాపార సంఘాలకు కూలి రేట్లు పెంచాలని అభ్యర్థిస్తూ లేఖ రాసినప్పటికీ వారి నుంచి కనీస స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. యాజమాన్యాలు ఇటువంటి నిర్లక్ష్య వైఖరిని విడనాడి రోజురోజుకి పెరుగుతున్న నిత్యావసరాల, విద్య, వైద్య ధరలను పేద కార్మికులు భరించలేని అర్ధాకలితో అలమటిస్తున్న యాజమాన్యాలు మానవతా దృక్పధంతో ఆలోచించి కార్మికుల మనుగడకు 30 % కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేసారు. లేని పక్షంలో రానున్న 5 వ తేదీ నుండి సమ్మెకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొట్టు రమణారావు, సిహెచ్.మారుతీ, చీకటి సైదారావు, ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరెడ్డి, కోటిపల్లి ఆవులయ్యా, సురసాని శ్రీనురెడ్డి, కె.నాగేశ్వరరావు, డబ్బా కొట్టు శ్రీను, ట్విల్స్ ముఠా వెంకటేశ్వర రెడ్డి సిపిఎం నాయకులు దోనేపూడి కాశీనాధ్, సిఐటియు నాయకులు ఎన్.సీహెచ్.శ్రీనివాసరావు, సీతరామనారాయణ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల సిబ్బందిని సమస్యలు పరిష్కరించాలి

**- చెవిలో పువ్వులతో నిరసన, మానవహారం, ప్రదర్శన**



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24 (వార్తా ప్రభ ప్రతినిధి):** సహకార సంఘాల్లో 2019 తరువాత విధుల్లో చేరిన సిబ్బందిని రెగ్యులర్ చేయాలని సహకార సంఘ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గంలోని సహకార సంఘాల ఉద్యోగులు ఇబ్రహీంపట్నం కేడీసీసీ బ్యాంకు ఎదుట మంగళవారం చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన, మానవహారం ఏర్పాటు చేశారు. తిరిగి కేడీసీసీ బ్యాంకుకు చేరుకుని నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 80 రోజుల నుంచి దశల వారీగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సహకార ఉద్యోగులకు 62 సంవత్సరాలకు ఉద్యోగ విరమణ వయస్సు ప్రకటించాలని, చట్టప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న రిక్రూట్ మెంట్ జరపాలని విజ్ఞప్తి చేశారు. సహకార ఉద్యోగుల కోర్కెలు నెరవేర్చని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రెండు దఫాలుగా విడుదల చేయాల్సిన హెచ్ ఆర్ పాలసీని ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. హెచ్ ఆర్ విడుదల చేస్తే ప్రభుత్వంపై ఒక్క రూపాయి కూడా భారం పడదన్నారు. ప్రభుత్వం ఎందుకు మొండి వైఖరి అవలంభిస్తుందో అర్థం కావడం లేదన్నారు. 2019 తరువాత విధుల్లో చేరిన ఉద్యోగులు రాత్రనక, పగలనక కష్టపడి పనిచేశారని, వారిని రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. దాములూరు పీఏసీఎస్ సీఈవో, జేఏసీ జిల్లా కమిటీ సభ్యుడు కె.సతీష్, ఇబ్రహీంపట్నం, ఈలప్రోలు, కొటికలపూడి, మూలపాడు సీఈవోలు టి.రవికుమార్, ఎన్.కె.పవన్ కుమార్, వేణు, లక్ష్మి, జి.కొండూరు బ్రాంచి ఇన్ చార్జి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# నాటక కళా రంగాన్ని బతికించండి

**రాష్ట్ర అధ్యక్షులు తాతారావు యాదవ్ విజ్ఞప్తి**





**పాయకరావుపేట,ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా మొదటిసారిగా లింగాపురం గ్రామంలో ప్రముఖ నాటక రచయిత టీ తాతారావు యాదవ్ కి భారీ సన్మానం జరిగింది. పాయకరావుపేట నియోజకవర్గం, లింగాపురం గ్రామంలో గౌరీ పరమేశ్వరి కళా నాట్యమండలి వారు నువ్వే కావాలి అని సాంఘిక నాటకాన్ని ప్రదర్శించడం జరిగింది. ఆ నాటకానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ నాటక రచయిత టీ తాతారావు యాదవ్ వెళ్ళటం జరిగింది. గ్రామ ప్రజలు, నాటక సమాజం వారు మిత్రులు, ఆ గ్రామ డీలర్ అప్పలస్వామి వారి టీము ప్రముఖ నాటక రచయిత టీ తాతారావు యాదవ్ ని ఘనంగా సన్మానించడం జరిగింది. ఇటువంటి ఆటంకం లేకుండా పోలీసు వారు పర్మిషన్ ఇచ్చి హోం మినిస్టర్ దగ్గర ఫుల్ పర్మిషన్ తెచ్చుకొని నాటకాన్ని చాలా చక్కగా ప్రదర్శించడం జరిగింది. ఇలానే అన్ని గ్రామాల్లో నాటక సమాజాల వారు నాటకాలు ప్రదర్శించాలని, నాటక కళా రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలని పత్రిక ముఖంగా ప్రముఖ నాటక రచయిత టీ తాతారావు యాదవ్ తెలియజేయడం జరిగింది.

## ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా.

**కాంగ్రెస్ నాయకులు దొంతి శేఖర్ ముదిరాజ్**




**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ):**గంగారం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల కొరతపై స్థానిక నాయకులు సమీక్ష నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దొంతి శేఖర్ ముదిరాజ్ హెడ్మాస్టర్ సుభాష్ మరియు ఉపాధ్యాయ బృందంతో సమావేశమై పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు.తరగతి గదుల కొరత,తాగునీటి సమస్య, మరుగుదొడ్ల నిర్వహణ లోపాలు, ఫర్నిచర్ అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు.పాఠశాల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు సమకూర్చేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత, భవనాల దుస్థితి,పోషకాహార సరఫరాలో ఉన్న సమస్యలపై కూడా ప్రత్యేకంగా ఆరా తీశారు. చిన్నారుల ఆరోగ్యం మరియు విద్య దెబ్బతినకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తామని దొంతి శేఖర్ ముదిరాజ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ భీమమ్మ పాల్గొన్నారు.

## శక్తి నగర్ లోని కమ్యూనిటీ హాల్ లో పూర్తి మౌలిక సదుపాయాలు ఏర్పాటు

**పురపాలక సంఘం చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు**



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24(వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు, స్థానిక కౌన్సిలర్ పులి అరుణ కుమారి విజ్ఞప్తి మేరకు శక్తి నగర్ లోని కమ్యూనిటీ హాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా భీమరాజు గుట్ట మరియు శక్తి నగర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు కమ్యూనిటీ హాల్‌లో కార్యక్రమాలు నిర్వహించేందుకు మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చైర్మన్ కు వివరించారు. స్థలాన్ని పరిశీలించిన చైర్మన్, అక్కడ తగిన మరుగుదొడ్లు లేకపోవడం, హ్యాండ్‌వాష్ సింక్ సదుపాయం లేకపోవడం, విద్యుత్ పనులు పూర్తి కాకపోవడం గమనించారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా, కమ్యూనిటీ హాల్ పరిసరాలలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, శుభ్రత మరియు పరిశుభ్రతను నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహించేలా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మౌస్మీ గనియా, కౌన్సిలర్ చనుమోలు నారాయణ, టీడీపీ నాయకులు పులి దాసు పాల్గొన్నారు.

## జూలైలో తెలుగు రచయిత్రుల మహాసభలు...

**- ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు వెల్లడి**



**గుడ్లవల్లేరు:ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలుగు రచయిత్రుల మహాసభలను జూలై 11, 12వ తేదీల్లో ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి, 2000 మిలీనియం రజతోత్సవం, యాబదేళ్ళ క్రితం బందరులో నిర్వహించిన రచయిత్రుల మహాసభల స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని తెలుగు రచయిత్రుల మహాసభలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. విజయవాడ కె బి యన్ కళాశాలలో ఈ మహాసభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గత పాతికేళ్ల కాలంలో తెలుగు భాషా సాహిత్యాల ప్రగతి, రానున్న పాతిక సంవత్సరాల్లో భాష, సాహిత్యం, సంస్కృతి, వివిధ సామాజిక అంశాలపై ఒక ప్రణాళిక గురించి చర్చా గోష్ఠులు, కవి సమ్మేళనాలు, రచయిత్రులు, పరిశోధకులు, పాత్రికేయ మహిళలతో ప్రత్యేక సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రాంతాలకు, వర్గాలకు అతీతంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు రచయిత్రులు, ఉద్యోగినులు, ఉపాధ్యాయినులు, ఉన్నత అధికారిణులు, మహిళా పారిశ్రామిక వేత్తలు వివిధ సంఘాల్లో కీలక పాత్ర వహిస్తున్న మహిళలందరికీ ఆహ్వానం పలుకుతున్నామన్నారు. ఈ మహాసభలలో మహిళలతో పాటు పురుషులు కూడా ఆహ్వానితులేనని, అయితే వేదికలపై మహిళలకు మాత్రమే అవకాశాలుంటాయని తెలిపారు. ప్రతినిధి రుసుము రూ.300 అని చెప్పారు. 2026 ఏప్రియల్ 30వ తేదీలోగా నమోదైన రచయిత్రులకే వేదికపైన అవకాశం ఉంటుందన్నారు. 9391238390 నంబరు ద్వారా చెల్లింపులు చేస్తూ... తమ వివరాలను తెలియచేయవలసిందిగా కోరారు. వివరాల కొరకు ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు 94401 67697, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచంద్ 94401 72642 సంప్రదించవచ్చునని వివరించారు.

# రామగుండం మున్సిపల్ 'నీటి' మాయాజాలం!!

● ఒకే కుళాయి.. రెండు బిల్లులు ● యజమాని మారినా రికార్డులు మారవు ● పాత, కొత్త యజమానులకు 'డబుల్' వసూళ్లు ● టెక్నికల్ లోపమా? అధికారుల నిర్లక్ష్యమా? ● ఫీల్డ్ వెరిఫికేషన్ సున్నా.. కార్యాలయంలోనే పన్నుల గణితం ● నీటి పన్ను పేరిట యజమానులకు మున్సిపల్ షాక్






**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 24 (వార్తాప్రభ ప్రతినిధి** [illegible] నగరపాలక సంస్థలో నీటి బిల్లుల వసూళ్ల వ్యవహారం ఒ[illegible] ప్రహసనంగా మారి సామాన్య పౌరులను బెంబేలెత్తిస్తోంది[illegible] నిర్లక్ష్యంతో పాటుగా సాఫ్ట్‌వేర్ లోపాలు తోడవ్వడంతో పన్నుల పేరిట సాగుతున్న 'మాయాజాలం' సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతోంది. క్షేత్రస్థాయిలో వాస్తవాలను ఏమాత్రం పరిశీలించకుండా కేవలం ఏసీ గదుల్లో కూర్చుని కంప్యూటర్ రికార్డుల ఆధారంగా బిల్లులు రూపొందిస్తుండటంతో, ఒకే ఇంటికి ఇద్దరు వ్యక్తుల పేర్లపై వేర్వేరుగా బిల్లులు జారీ చేస్తూ అధికారులు వింత పోకడకు తెరలేపారు. దీనికి నిదర్శనంగా, ఒక ఇంటిని కొనుగోలు చేసిన నాగండ్ల రవి కుమార్ అనే కొత్త యజమానికి తన పేరుతో వచ్చిన బిల్లు చూసి ఊపిరి పీల్చుకునే లోపే, అదే ఇంటికి పాత యజమాని ఏ. నరసింహ చారి పేరుతో కూడా వేరొక బిల్లు రావడం చూసి ఆయన అవాక్కయ్యారు. ఆస్తి బదలాయింపు జరిగి పేరు మార్పిడి ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా పాత రికార్డులను తొలగించకుండా, పాత బకాయిలను కొత్త యజమాని ఖాతాలో కలపడమో లేక రెండింటినీ వేర్వేరుగా వసూలు చేయాలని చూడటమో అధికారుల చేతకాని [illegible] పడుతోంది. బాధితులు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి [illegible]టే, అది కేవలం సాంకేతిక లోపమని బుకాయిస్తూ పన్ను [illegible]నని సిబ్బంది ఒత్తిడి తీసుకురావడం గమనార్హం. ఇంటి పన్నుతో పాటు నీటి పన్నును ఇలా 'డబుల్' వసూలు చేస్తూ ప్రజల నుంచి అక్రమంగా ధనం పిండుకుంటున్న ఈ తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, నగర కమిషనర్ తక్షణమే స్పందించి, రికార్డులను క్షుణ్ణంగా ప్రక్షాళన చేసి నరసింహ చారి, రవి కుమార్ వంటి బాధితులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో నగరపాలక సంస్థ కార్యాలయం ముందు భారీ స్థాయిలో నిరసనలు తప్పవని నగర ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# అనాథ శవం కాదు.. అద్భుతమైన పాఠం!!

● ఒడ్నాల చంద్రయ్య అమరత్వం ● వైద్య పరిశోధనలకు వృద్ధుడి దేహదానం ● గుర్రంపల్లి గ్రామ పెద్దల సాహసోపేత నిర్ణయం



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**అనాథ శవం కాదు.. అద్భుతమైన పాఠంగా ఆ పార్థివ దేహం పనికి వస్తున్నది అంటే అతిశయోక్తి కాదు. పెద్దపల్లి జిల్లా గుర్రంపల్లి గ్రామానికి చెందిన ఒడ్నాల చంద్రయ్య (72) అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన పార్థివ దేహాన్ని రామగుండం మెడికల్ కాలేజీకి దానం చేసి గ్రామ పెద్దలు మానవత్వాన్ని చాటుకున్నారు. మృతుడికి కుటుంబ సభ్యులు లేకపోవడంతో, గ్రామ సర్పంచ్ తొగరి సంపత్, మాజీ సర్పంచ్ జక్కుల రాజేశం చొరవ తీసుకుని, సదాశయ ఫౌండేషన్ సహకారంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం రామగుండం సిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ నరేందర్ సమక్షంలో అనాటమీ విభాగానికి దేహాన్ని అప్పగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.....వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం దేహాన్ని దానం చేయడం అత్యంత అభినందనీయమని, సమాజానికి ఇది ఒక గొప్ప సందేశమని కొనియాడారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి వాసు సమన్వయంతో, పోలీస్ శాఖ అనుమతులు పొంది అన్ని ప్రక్రియలను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, అనాటమీ హెచ్ఓడీ శశికాంత్ తదితరులు పాల్గొని గ్రామ పెద్దల సామాజిక స్పృహను ప్రశంసించారు. ఎమ్మెల్యే విజయ రమణరావుతో పాటు పలువురు ప్రముఖులు ఈ సేవా కార్యక్రమానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# కుర్చీలకే పరిమితమైన జిహెచ్ఎంసి అధికారులు....!

● సీఎం ఆదేశాలకే తూట్లు పొడుస్తున్న డిసి! ● ప్రజా సమస్యలు అడిగితే విలేకరిపైనే చిందులు తొక్కిన డిసి..! ● 'దోమల బెడద'పై మొద్దు నిద్ర.. ఫాగింగ్ ఊసే లేదు, ప్రజల ప్రాణాలతో చెలగాటం! ● 'జేసీబీ లేదు' అంటూ మరో డిఇ వింత సమాధానం.. అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం.







**కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 24, (వార్తాప్రభ) :** మున్సిపల్ అధికారులు ఏసీ రూములకు, తమ కుర్చీలకే పరిమితం కాకుండా ప్రజల్లోకి వెళ్లి పనులు చక్కదిద్దాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిస్తున్నా.. కుత్బుల్లాపూర్ అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. చింతల్ సర్కిల్ జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలోని పార్కు అభివృద్ధిపై పత్రికల్లో వార్తలు వచ్చినా, అధికారులు 'తుతూ మంత్రం' సేవలతో కాలం గడుపుతున్నారు.

**ఒక అధికారిణి అహంకారం.. విలేకరిపై వితండవాదం!** పార్కు పనులు కేవలం రెండు రోజులు చేసి ఎందుకు ఆపేశారని చింతల్ డిసి ను ప్రశ్నిస్తే, వారి ఇచ్చిన సమాధానం విని ప్రజలు విస్మయం చెందుతున్నారు. ఒక బాధ్యతాయుతమైన అధికారిణిగా సమస్యను పరిష్కరించాల్సింది పోయి.. "మీరే ప్రజల్లో అవేర్నెస్ తీసుకురండి, టైం వచ్చినప్పుడు మేమే చేస్తాం" అని ఒక పత్రికా ప్రతినిధిపైనే ఎదురుదాడి చేయడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ప్రజలు పన్నుల రూపంలో కట్టే జీతాలు తీసుకుంటూ, ప్రజలకే ఉచిత సలహాలు ఇవ్వడం ఏంటని స్థానికులు మండిపడుతున్నారు.

**దోమల కోటగా పార్కు.. తలుపు తీయాలంటేనే భయం!**పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కల వల్లతీ ఈ ప్రాంతం ఇప్పుడు దోమలకు నిలయంగా మారింది. దోమల బెడద ఎంతలా పెరిగిందంటే, సాయంత్రం 6 గంటలైతే చాలు రాజీవ్ గృహకల్ప వాసులు తలుపులు తీయాలన్నా వణికిపోతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తలుపులు మూసుకుని గడపాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం దోమల నియంత్రణకు 'ఫాగింగ్' చేయాలన్న కనీస జ్ఞానం కూడా అధికారులకు లేకపోవడం శోచనీయం. డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**జేసీబీ లేదట.. విడ్డూరం కాకపోతే మరేమిటి?** మరోవైపు సంబంధిత డిఇ మాట్లాడుతూ.. "మా దగ్గర జేసీబీ లేదు, అది వచ్చినప్పుడే పని మొదలుపెడతాం" అని అత్యంత పేలవమైన సమాధానం చెబుతున్నారు. వేల కోట్ల బడ్జెట్ ఉన్న జీహెచ్ఎంసీలో ఒక పార్కు శుభ్రం చేయడానికి జేసీబీ లేదనడం హాస్యాస్పదం. అధికారులు సాకులు చెబుతూ కాలయాపన చేయడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**సీఎం ఆదేశాలు బేఖాతరు!**ప్రజలకు ఇబ్బంది కలగకుండా చెత్తను తొలగించాలని, పార్కులను అభివృద్ధి చేయాలని సీఎం స్వయంగా హెచ్చరిస్తున్నా.. ఇక్కడి అధికారులు మాత్రం మొద్దు నిద్ర వదలడం లేదు. రాజీవ్ గృహకల్ప పార్కు అసాంఘిక కార్యకలాపాలకు మరియు రోగాలకు నిలయంగా మారుతుంటే, అధికారులు మాత్రం 'టైం రావాలి' అంటూ కాలక్షేపం చేస్తున్నారు. జోనల్ కమిషనర్ స్పందించి, ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తూ, పనులు ఎగ్గొడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తక్షణమే ఫాగింగ్ చేయించి, పార్కు పనులను పూర్తి చేయాలని గృహకల్ప వాసులు డిమాండ్ చేస్తున్నారు

# ఎమ్మెల్యే వసంత హామీతో నిరసన విరమించిన అరుణ నగర్ వాసులు



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి అరుణ నగర్ ప్రాంతంలో క్వారీ వాహనాల రాకపోకల వల్ల ఏర్పడుతున్న గాలి కాలుష్యం మరియు ధూళి కాలుష్య సమస్యలపై గత కొన్ని రోజులుగా స్థానిక ప్రజలు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ని అరుణ నగర్ నివాసితులు కలిసి తమ సమస్యలను వివరించారు.స్థానిక ప్రజల ఆవేదనను గమనించిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ వెంటనే స్థానిక నివాసితులు, క్వారీ యజమానులు మరియు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. అరుణ నగర్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఈ కమిటీలో స్థానిక నివాసితులు, క్వారీ యజమానులు, కొండపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ సభ్యులుగా ఉంటారు.ధూళి కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతిరోజూ రోడ్లపై నీటి చల్లింపు (వాటరింగ్) కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు.ఈ చర్యలు వచ్చే ఆరు నెలల పాటు అమల్లో ఉంటాయి.క్వారీ వాహనాల కోసం ప్రత్యామ్నాయ రహదారి శాంక్షన్ చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.రోడ్డు మార్గ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.అదనంగా, అరుణ నగర్ ప్రాంతంలో చేపట్టే చర్యల అమలులో ఎటువంటి ఆలస్యం జరిగినా స్థానిక ప్రజలు నేరుగా తనను కలిసి వివరించవచ్చని ఎమ్మెల్యే గారు భరోసా ఇచ్చారు.ఎమ్మెల్యే చొరవతో కొద్ది రోజులుగా కొనసాగుతున్న నిరసన విరమించి ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.

## పుణ్యక్షేత్రాల యాత్ర!!

● టి.జి.ఎస్.ఆర్.టి.సి ప్రత్యేక కానుక
● ప్రయాణంలో 10 దక్షిణ భారత పుణ్యక్షేత్రాల దర్శనం ● ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం
● గోదావరిఖని డిపో మేనేజర్ యం.నాగభూషణం

**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గోదావరిఖని డిపో వారు మార్చి 8, 2026 నుండి అరుణాచలం, రామేశ్వరం క్షేత్రాలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బస్సు మార్చి 8వ తేదీ మధ్యాహ్నం 1:00 గంటకు గోదావరిఖని నుండి బయలుదేరి పెద్దపల్లి, కరీంనగర్ మీదుగా ప్రయాణించి కాణిపాకం, అరుణాచలం, శ్రీరంగం, పళని, పాతాళశంభు, మధురై, రామేశ్వరం, విష్ణుకంచి, శివకంచి అలాగే జోగులాంబ వంటి పది పుణ్యక్షేత్రాలను సందర్శిస్తుంది. సుమారు వారం రోజుల పాటు సాగే ఈ ఆధ్యాత్మిక యాత్ర ముగించుకుని మార్చి 14వ తేదీన బస్సు తిరిగి గోదావరిఖనికి చేరుకుంటుంది. ఈ యాత్రకు టికెట్ ధర పెద్దలకు 9,000 రూపాయలు, పిల్లలకు 6,000 రూపాయలుగా నిర్ణయించబడింది. ఆసక్తి గల ప్రయాణీకులు 90004 సర్వీస్ నంబర్ ద్వారా తమ సీట్లను రిజర్వేషన్ చేసుకోవచ్చని డిపో మేనేజర్ యం. నాగభూషణం తెలిపారు. మరిన్ని వివరాల కోసం భక్తులు 7382847596 లేదా 7013504982 నంబర్లను సంప్రదించాలని, అలాగే ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు. భక్తులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ తరఫున డిపో మేనేజర్ విజ్ఞప్తి చేశారు.

## ఏటీఎం నగదు దొంగ అరెస్ట్

**రూ.34.90 లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు**



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 24 (వార్తా ప్రభ):** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏటీఎం నగదు రవాణా వాహనం నుంచి రూ.56 లక్షలు అపహరించిన కేసును పోలీసులు ఛేదించారు.నిందితుడు బడిగేరే అజిత్ కుమార్ (34)ను శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.34.90 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం,ఈ నెల 12న గోపనపల్లి తండా ప్రాంతంలో ఏటీఎంలకు నగదు సరఫరా చేస్తున్న సమయంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న అజిత్ కుమార్ సహచరులు బయట ఉన్న అవకాశాన్ని ఉపయోగించుకుని వాహనాన్ని నగదుతో సహా తీసుకెళ్లాడు. అనంతరం నగదు పెట్టెను తెరిచి డబ్బుతో పరారయ్యాడు.సీసీటీవీ ఫుటేజ్,సాంకేతిక ఆధారాల ఆధారంగా పోలీసులు అతని కదలికలను ట్రాక్ చేసి అరెస్ట్ చేశారు.మిగిలిన నగదును ఖర్చు చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.డ్రైవర్ల నియామకంలో నిర్లక్ష్యం వహించిన సెక్యూరిటీ ఏజెన్సీపై కూడా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## మియాపూర్ బస్ స్టాప్ వద్ద సీసీ రోడ్ ఏర్పాటు

**- ట్రాఫిక్ సమస్యలకు చెక్**



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 24 (వార్తా ప్రభ):** మియాపూర్ బస్ స్టాప్ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న తీవ్ర ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారులతో సమన్వయంతో సీసీ రోడ్ నిర్మాణాన్ని పూర్తి చేశారు.మియాపూర్ బస్ స్టాప్ వద్ద రహదారి దెబ్బతినడం,గుంతలు ఏర్పడడం వల్ల వాహనాలు నెమ్మదిగా కదలడంతో తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా పీక్ అవర్స్ సమయంలో ప్రయాణికులు,ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని సమీక్షించిన ట్రాఫిక్ పోలీసులు జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టారు.నిరంతర కృషి ఫలితంగా బస్ స్టాప్ సమీపంలో సీసీ రోడ్ వేయడం పూర్తి చేశారు.రహదారి సమతలీకరణతో పాటు వాహనాల సాఫీగా రాకపోకలకు అనుకూలంగా మార్పులు చేశారు. రోడ్డు పనులు పూర్తికావడంతో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని అధికారులు తెలిపారు.

## నారా లోకేష్ ఆధ్వర్యంలోని వైసిపి నాయకులపై దాడులు

**మాజీ ఉప మంత్రి ధర్మాన కృష్ణదాస్**



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24 (వార్తా ప్రభ ప్రతినిధి):** నారా లోకేష్ రోద్భలంతోనే వైసీపీ నాయకుల పై దాడులు జరుగుతున్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మన్న కృష్ణ ప్రసాద్. మంగళవారం మాజీ మంత్రి జోగి రమేష్ ను పరామర్శించారు ధర్మన్న. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి కోసం ఆత్మాహుతి దళంగా పని చేస్తామని,కూటమి ప్రభుత్వ చర్యలు వైసీపీ శ్రేణుల్లో తెగింపునిచ్చాయి అని అన్నారు.లోకేష్ ఆధ్వర్యంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుండే వైసీపీ శ్రేణుల పై దాడులకు తెగబడుతున్నారు.ఇది కూటమి ప్రభుత్వానికి మంచిది కాదు, ప్రజలు తెలివి కలిగిన వారు, అన్నీ గమనిస్తున్నారని,మాజీ మంత్రి జోగి రమేష్ జగన్మోహన్ రెడ్డి కి, పార్టీకి విధేయుడిగా పని చేస్తున్నారని అన్నారు.అక్రమ కేసులు బనాయించి జగన్మోహన్ రెడ్డి కి జోగి రమేష్ ని దూరం చేయడానికి ప్రయత్నించారు.ఎన్ని ఆకృత్యాలకు ఒడిగట్టినా మేమంతా ఆయనకి అండగా ఉంటామని తెలిపారు.కూటమి ప్రభుత్వ చర్యలను ఆ కూటమి లోనే విజ్ఞత కలిగిన రాజకీయ నాయకులు తప్పు పడుతున్నారు.కొన్ని రాష్ట్రాలకి పరిమితమైన, మన రాష్ట్రంలో ఎప్పుడూ లేని వికృత రాజకీయ సాంస్కృతిని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు.వీరి చర్యలు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరింత ప్రమాదకరమైన రాజకీయాలను చూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

# వైకాపా ప్రయోజనాల కోసమే సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్

## -కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు



**గుడివాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** వైకాపా ప్రయోజనాల కోసమే కల్తీనెయ్యి వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిటీకి వ్యతిరేకంగా మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీం కోర్టుకు వెళ్ళారని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు విమర్శించారు. ఆయన దాఖలు చేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేయడం హర్షణీయమని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సిట్ నివేదిక ఆధారంగా వైకాపా ప్రభుత్వంలో నెయ్యి కొనుగోళ్లలో జరిగిన అవకతవకలు, అధికార బాధ్యతారాహిత్యాన్ని గుర్తించేందుకే ప్రభుత్వం ఏకసభ్య కమిటీ నియమించిందని స్పష్టం చేశారు. జగన్ కోరుకున్నట్లుగా చర్చను ఆపాలని, పరిపాలనాపరమైన విచారణను అడ్డుకోవాలని స్వామి గారు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. ఈక్రమంలో "తాడేపల్లి ప్యాలెస్" నుండి "సుప్రీంకోర్టు మెట్ల" వరకు సాగిన ఈ 'జగన్ ప్రహసనం' చివరకు అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగంగా ప్రకటనలు చేశారని, అది సమస్య అని స్వామి వాదించడం వెనుక.. వైకాపా, సాక్షి చేస్తున్న పాత వాదనలే వినిపించాయి. కానీ, చార్జిషీట్ దాఖలైంది, విచారణ పూర్తయింది అన్న వాస్తవాలను కోర్టు గుర్తించింది. ఈ పిటిషన్‌కు సరైన బేస్ లేదు అని ధర్మాసనం వ్యాఖ్యానించడం విశేషం. తప్పు చేసిన వారు దొరికిపోతారనే భయంతోనే.. విచారణల మీద స్టేలు ఎందుకు? అన్న సామాన్య భక్తుడి ప్రశ్నకు ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ఒక సమాధానంగా నిలిచిందన్నారు.

# నందివాడ సచివాలయాన్ని సందర్శించిన జెసి నవీన్‌కుమార్..



**గుడివాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ఈరోజు 24వ తేది ఉదయం కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ ఏం. నవీన్ కుమార్ సాధారణ పరిపాలన తనిఖీలో భాగంగా నందివాడ మండలం లోని నందివాడ గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆఫీసు రికార్డులను, ఉద్యోగుల పనితీరు మరియు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న వివిధ ప్రభుత్వ సేవలను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో జి. బాలసుబ్రమణ్యం, నందివాడ ఎమ్మార్వో ఎన్.గురుమూర్తి రెడ్డి, ఎంపీడీవో పి.మల్లేశ్వరి, పంచాయతీ కార్యదర్శి కె.సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చిరంజీవి పునర్వికా కోసం యాచిస్తున్న సోషల్ మీడియా వారియర్స్..




**గుడివాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** స్థానిక నెహ్రూ చౌక్ సెంటర్లో చిరంజీవి పునర్విక 16 కోట్లు ఇంజక్షన్ సహాయం కోసం పట్టణంలో ఉన్న సోషల్ మీడియా వారియర్స్ రోడ్లు వెంబడి సహాయం కోసం అర్జిస్తూ వచ్చిన సొమ్మును ఆ పాప వాళ్ల తల్లిదండ్రులకి అందజేసిన గుడివాడ పట్టణ సోషల్ మీడియా వారియర్స్.. ! ఈ సందర్భంగా గుడివాడ పట్టణ ఆర్కే వారియర్స్ అధ్యక్షులు డా. మాచర్ల రామకృష్ణ (ఆర్.కె) మాట్లాడుతూ మానవత్వాన్ని గెలిపించిన గుడివాడ పట్టణ సోషల్ మీడియా మిత్రులకు ముఖ్యంగా చిన్నచిన్న పిల్లలకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని తెలియజేశారు. నేను చేసిన ఈ సేవకు ఆ పాప ఆరోగ్యంగా జీవించాలని ఆ భగవంతుని కోరుకుంటున్నానని, అదేవిధంగా ఆ పాప సహాయార్థం రాష్ట్ర ప్రభుత్వం కూడా సహాయం చేయడం జరుగుతుందని వారి తల్లిదండ్రులు తెలియజేశారని, రాష్ట్ర ప్రభుత్వానికి మా గుడివాడ పట్టణ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పట్టణ సోషల్ మీడియా యువతి, యువకులు, చిన్న చిన్న పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# డగ్స్ లేని రాష్ట్రంగా ఉండలంటే యువత నడుం బిగించాలి - ట్రాఫిక్ ఎస్ఐ నాగరాజు



**గుడివాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** మన రాష్ట్రం డ్రగ్స్‌లేని విధంగా ఉండలంటే యువత చేడు అలవాటులను దూరంగా ఉంటు మిత్రులను కూడ కాపాడలని ట్రాఫిక్ ఎస్ఐ నాగరాజు విద్యార్థులకు పిలుపు నిచ్చారు. చిల్డ్రన్స్ గార్డెన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ట్రాఫిక్ ఎస్ఐ పి.నాగరాజు అధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు, గుడివాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ వి. ధీరజ్‌వినీల్ ఆధ్వర్యంలో యువతకు రోడ్డు భద్రత, మైనర్ డ్రైవింగ్, ఈవ్ టీజింగ్ డ్రగ్స్ తదితర అంశాలపై అవగాహన నిర్వహించామన్నారు. ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు బాధితుడిని గంటలోపు హాస్పిటల్ జాయిన్ చేసి బాధితుడి ప్రాణాలు కాపాడిన వారికి ప్రభుత్వం తరఫున నగదు బహుమతి, ప్రశంసా పత్రం పొందే అవకాశం ఉందన్నారు. ఏదైనా సమస్యలు ఎదురైనప్పుడు డయల్ 112కి కాల్ చేయాలని, ఆన్లైన్ మోసాలకు సంబంధించి 1930కి కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ గార్డెన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెచ్.ఎం ఎం.వి.కృష్ణారావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# జీవో 36ను అమలు పరచకుంటే ఆమరణ నిరవధిక సమ్మెకు సిద్ధం

● సహకార సంఘాల జెఏసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు హనుమంతరావు ● విన్నూతంగా దుస్తులు విప్పి, అర్ధనగ్నంగా చీపుర్లతో నిరసన



**గుడివాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** సహకార బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత 2 నెలుగా వివిధ రూపాలలో నిరసన తెలుపుతున్న ప్రభుత్వం కళ్ళు తెరవడం లేదని తమ సమస్యలను పరిష్కరించకుంటే అమర నిరహార దీక్షలకు సిద్ధంగా ఉన్నామని ఏపి పిఏసిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టిపిఎస్ హనుమంతరావు హెచ్చారించారు. మంగళవారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయం సమీపంలోని బజార్ బ్రాంచ్ వద్ద కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉదోగస్తునలు అర్ధనగ్నంగా, చీపుర్లతో కార్యాలయం శుభ్రపరుస్తు నిరవదిక సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా ఏపి పిఏసిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టిపిఎస్ హనుమంతరావు మాట్లాడుతూ జివో నెం 36ను అమలు పరిచి, 2019 నుండి 2024 వరకు పెండింగ్ ఉన్న వేతన సవరణలు చేసి మధ్యంతర భృతి చెల్లించలన్నారు. కెడిసిసి మెయిన్ బ్రాంచ్‌లోని 12 సంఘాల నిరవధిక సమ్మె చేస్తున్నాయన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని, ప్రభుత్వ తీరు మారచుకోక పోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చారించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రమేష్‌బాబు, కుమారి, గాయత్రి, ఆశ, ప్రమీలా, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమి సభ్యత్వంతో పార్టీలో నాయకత్వ అవకాశాలు

## ఈనెల 26వ తేది నుండి జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం..



**గుడివాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ఈ రోజు(24-2-26) ఉదయం గుడివాడ జనసేన పార్టీ కార్యాలయం లో జనసేన పార్టీ క్రియశీలక సభ్యత్వ నమోదు ప్రారంభం ఈనెల 26 నుండి మార్చి 10 వరుకు పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో పాల్గొన్న జనసేన గుడివాడ ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ.. జనసైనికులకు వీరమహిళలకు అండగా నిలిచేందుకు, వారి జీవితాలకు, కుటుంబాలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో, వారిని కొత్తతరం నాయకులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జనసేన పార్టీ అధినేత శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. మరియు సభ్యత్వం కేవలం 400 రూపాయలకు, దీనికి , రు॥5 లక్షల ప్రమాద బీమా మాత్రమే కాకుండా, వారికి నాయకత్వ అవకాశాలు కల్పించే అవకాశాలు ఈ ఉద్యమి సభ్యత్వం కల్పించనుంది అని తెలిపారు. కావున జనసేన పార్టీ కార్యకర్తలు, వీరమహిళలు అందరూ సభ్యత్వం తీసుకుని ఈ కార్యక్రమంని విజయవంతం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాస రావు, పట్టణ ఉపాధ్యక్షులు వేమూరి త్రినాథ్, ఐటి కోఆర్డినేటర్ చింత రామకృష్ణ, సుంకర వెంకట్, వై శ్రీనివాస రావు, షేక్ మీరాషరీఫ్, దుర్గ రావు మరియు వీరమహిళలు కళ్యాణి, దుర్గా, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

# ఎఎన్నార్ కళాశాలలో పోలీసు వారి అవగాహన సదస్సు



**గుడివాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** యువత మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్, బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక అక్కినేని నాగేశ్వర రావు కళాశాలలో జరిగిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిధిగా విచ్చేసిన వన్ టౌన్ సి.ఐ. కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా ఎప్పటికప్పుడు తమ పిల్లల నడవడికను గమనిస్తూ ఉండాలని 15-25 ఏళ్ళలోపు యువత ఎక్కువగా దురలవాట్లకు బానిసలవుతున్నారని, దీనివలన విద్యార్థులు యొక్క బంగారు భవిష్యత్తు నాశనమైపోతుందని దీన్ని తరిమికొట్టాల్సిన భాధ్యత యువత, విద్యార్థులపై ఉందని, నేరాల సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు 112కి ఫోన్ చేయాలని వారు కోరారు. నేర ప్రవృతి కలిగిన వారు మానసిక వత్తిడి, మూడ్ స్వింగ్స్, అందరితో పోట్లాటలు చేస్తారు. ఆత్మహత్య చేసుకునే ముప్పు కూడా ఎక్కువగా వున్నదని తెలియజేసారు. తల్లిదండ్రులు అధ్యాపకులు, విద్యార్థులు అందరూ కలసి మన సమాజమును నేరరహిత సమాజముగా చేయాల్సిన బాధ్యతను గుర్తుచేశారు. 18 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు (బాలబాలికలు) పోక్సో చట్టం పరిధిలోకి వస్తారు. 18 ఏళ్ల లోపు పిల్లలను లైంగిక వేధింపులు, దాడులు, అసభ్యకరమైన ప్రవర్తన మరియు అశ్లీల చిత్రాలను రూపొందించబడిన భారతీయ చట్టం పోక్సో చట్టవిరుద్ధంగా పరిగణిస్తుంది. ఈ కార్యక్రమములో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్, కళాశాల పాలక వర్గ ప్రెసిడెంట్ ఎల్.ఆర్.కె. ప్రసాద్, కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.ఎస్.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, ఎన్.సి.సి. ఆఫీసర్ లెఫ్ట్ నెంట్ ఎం.డి.సలీమ్, ఎన్.ఎస్.ఎస్. ఆఫీసర్ ఎం.జేసుబాబు, అధ్యాపకులు, అధ్యపకేతర సిబ్బంది, శక్తి టీం సభ్యులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు..

● గుడివాడ 2టౌన్ పరిధిలో వాహన తనిఖీలు.. బ్రీత్ ఎనలైజర్ తో వాహనదారులను పరీక్షించిన పోలీసు సిబ్బంది..



**గుడివాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుడివాడ 2టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జె.ఆర్.కె. హనీష్ ఆధ్వర్యంలో సబ్ ఇన్స్పెక్టర్ పి. లోవరాజు డబ్ల్యుఎస్సై పి. శిరీష, సిబ్బంది.. వాహనాల తనిఖీలు మరియు బ్రీత్ ఎనలైజర్ తో వాహనదారులను పరీక్షించారు. ఈ సందర్భంగా వాహనదారులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికేట్ వంటి పత్రాలు కలిగి ఉండాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే మైనర్ లు డ్రైవింగ్ చేయరాదు అని హెచ్చరించారు. వాహనాల తనిఖీల సమయంలో పై నిబంధనలు పాటించని వాహనదారులపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించబడతాయని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

# రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన



**కాకినాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా లైన్స్ క్రాసింగ్, ఫుట్‌పాత్ వినియోగంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం మంగళవారం స్థానిక తిలక్ వీధిలోని యోగానంద్ హై స్కూల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. దీనిపై అవగాహనలో భాగంగా ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెడ్ లైట్ పడిన తర్వాత మాత్రమే, జీబ్రా లైన్స్ వద్ద రోడ్డును దాటాలని సూచించారు. జీబ్రా లైన్స్ లేని ప్రదేశాలలో ఇరువైపులా గమనించి జాగ్రత్తగా రోడ్డును దాటాలని తెలిపారు. ట్రాఫిక్ సైన్స్‌లో మెండటరీ, కాషనరీ, ఇన్ఫర్మేటరీ సూచికల ప్రాముఖ్యతను వివరించారు. వన్‌వే రోడ్లలో తప్పుగా ప్రయాణించడం వల్ల జరిగే ప్రమాదాలపై హెచ్చరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించడం ప్రమాదకరమని, డ్రైవర్ పక్కన లేదా వెనుకవైపు కూర్చోరాదని తెలిపారు. ఫుట్‌పాత్ ఉన్నచోట తప్పనిసరిగా ఫుట్‌పాత్‌పైనే నడవాలని, లేకపోతే రోడ్డుకు ఎడమవైపు జాగ్రత్తగా నడవాలని సూచించారు. రోడ్డుపై నడుస్తూ సెల్‌ఫోన్ ఉపయోగించడం ప్రమాదకరమని హెచ్చరించారు. మోటార్‌సైకిళ్లు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చట్టవిరుద్ధమని వివరించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల చట్టపరమైన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు.

**సామాజిక అవగాహన:** ఈవ్ టీజింగ్, హరాస్మెంట్, స్టాకింగ్ వంటి వేధింపులపై మహిళలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలకు ప్రత్యేక చట్టపరమైన రక్షణలు ఉన్నాయని తెలిపారు. మద్యపానం, డ్రగ్స్, సిగరెట్లు, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

**సైబర్ నేరాలపై అవగాహన:** ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లోన్స్, ఆన్‌లైన్ జాబ్స్ మోసాలు, డిజిటల్ అరెస్టులపై జాగ్రత్తలు వివరించారు. అత్యవసర సేవల కోసం 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, మహిళా హెల్ప్‌లైన్ 1972 నంబర్ల వినియోగాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్ రమేష్, ట్రాఫిక్-1 ఎస్ఐ, యోగానంద్ స్కూల్ చైర్మన్ రవీంద్ర, ప్రిన్సిపాల్ విజయకుమార్ పాల్గొన్నారు.

# రెండో రోజుకు చేరుకున్న అంగన్వాడీ కార్యకర్తల రిలే నిరాహార దీక్షలు




**నందిగామ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్( సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ఎదురుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కె. గోపాల్ మాట్లాడుతూ పలు డిమాండ్స్ లను పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26000/-లు ఇవ్వాలి. పెండింగ్లో ఉన్న 1810 మినీవర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలి.గ్రాట్యూటీ అమలుకు గైడ్లైన్స్ రూపొందించాలి.హెల్పర్ల ప్రమోషన్లకు నిర్ధిష్టమైన గైడ్లైన్స్ రూపొందించి అమలుచెయ్యాలి.ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని తదితర డిమాండ్లను గోపాల్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గోపి నాయక్,కరి వెంకటేశ్వరరావు, హెల్పర్స్ అరుణ, మేరి, సరోజిని, రూమియా, మీరాబి, ధనలక్ష్మి, సుకన్య, నందిని, నాగలక్ష్మి హల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ కు 4రోజులు మాత్రమే గడువు

● మార్చ్ 1 నుండి 25% పెనాల్టీ -మునిసిపల్ కమీషనర్ మనోహర్



**గుడివాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** పట్టణ పరిధిలోని అన్ని వ్యాపారులు, దుకాణదారులు తమ ట్రేడ్ లైసెన్స్ లను తక్షణమే రెన్యువల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ సూచించారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్‌కు ఇంకా కేవలం 4 రోజులు మాత్రమే గడువు మిగిలి ఉందని తెలిపారు. గడువు ముగిసిన తరువాత, మార్చ్ 1 నుండి రెన్యువల్ చేయని వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం 25% పెనాల్టీ విధించబడుతుందని స్పష్టం చేశారు. కాబట్టి వ్యాపారులు ఆలస్యం చేయకుండా మున్సిపల్ కార్యాలయంలో లేదా సంబంధిత ఆన్‌లైన్ విధానం ద్వారా వెంటనే ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని కోరారు. అనవసరమైన పెనాల్టీలు మరియు చట్టపరమైన చర్యలకు గురికాకుండా నిర్దిష్ట గడువు లోపు రెన్యువల్ పూర్తి చేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# తూర్పు తెలుగుపాలెంలో బాల్య వివాహరహిత అవగాహనా సదస్సు



**పెడన,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్ కోసం 100 రోజుల అవగాహన కార్యక్రమం ఐసిడిఎస్ బంటుమిల్లి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పెడన పట్టణం తూర్పు తెలుగుపాలెంలో అంగన్వాడీ కేంద్రంలో నందు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో బాల్య వివాహాలు చేసుకోవడం వలన జరిగే అనర్థాల గురించి తద్వారా తలెత్తే ఆరోగ్య సమస్యలు చట్టపరంగా ఎదుర్కొనే ఇబ్బందుల గురించి వివరించారు.బాలికలకు విద్య గురించి అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ పిట్ల కల్పవల్లి అంగన్వాడీ టీచర్ పామర్తి కళావతి ఈ కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు ఈసందర్భంగా హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు

# బాల్య వివాహరహిత భారతదేశం కోసం 100 రోజుల అవగాహన కార్యక్రమం....



**కృతివెన్ను,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్ కోసం 100 రోజుల అవగాహన కార్యక్రమం ఐసిడిఎస్ బంటుమిల్లి వారి సారాధ్యంలో సూపర్వైజర్ రేవు నాగలక్ష్మి ఆధ్వర్యంలో బంటుమిల్లి మండలం మల్లంపూడి గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో బాల్య వివాహాలు చేసుకోవడం వలన జరిగే అనర్థాల గురించి, తలెత్తే ఆరోగ్య సమస్యల గురించి, చట్టపరంగా ఎదుర్కొనే ఇబ్బందుల గురించి విద్యార్థులకు వివరించారు. బాల కార్మికుల గురించి, నాణ్యమైన విద్య గురించి గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రేవు నాగలక్ష్మి, ఐ సి పి ఎస్ ఓ ఆర్ డబ్ల్యు సిహెచ్ నాగ భవాని, ప్రధానోపాధ్యాయుడు, సచివాలయ పంచాయతీ సెక్రెటరీ జోష్న, ఏ ఎన్ ఎం సంతోషమ్మ, ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు



**అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర మాజీ కోశాధికారి, ప్రముఖ రియల్టర్,బి. సి.పెద్దలు ఆలా బాలయ్య యాదవ్ మనవరాలి వివాహ వేడుక హైదరాబాద్,శంషాబాద్ పోర్ట్ గ్రాండ్ కళ్యాణ వేదిక లో జరగగా పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్**

**-విజయవాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :**



# హెల్మెట్ పై అవగాహన.....బైక్ ర్యాలీ





**జి.కొండూరు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా మైలవరం ఏసీపీ వై. ప్రసాదరావు ఆధ్వర్యంలో మండలంలోని కట్టుబడిపాలెం,విద్యానగరం, వినపాక, జి.కొండూరు గ్రామాలలో మంగళవారం ప్రజలకు హెల్మెట్ పై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మైలవరం ఏసీపీ వై ప్రసాద్ రావు, మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్, జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్ పోలీస్ సిబ్బంది ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు, కట్టుబడిపాలెం గ్రామ టీడీపీ నాయకులు సుమారు 50 మంది హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏసీపీ వై ప్రసాద రావు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారు తప్పక హెల్మెట్లు ధరించాలని, హెల్మెట్లు ధరించకపోవడం వల్ల ప్రమాదాల్లో తలకు తీవ్ర గాయాలు అయ్యి అనేక మంది చనిపోతున్నారని,దీంతో వారి కుటుంబా లు రోడ్డున పడుతున్నాయని అన్నారు. ప్రజలందరూ అవగాహనతో మెలిగి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు.రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ కట్టు దిట్టమైన చర్యలు తీసుకుంటుందని హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, తాగి బండి నడపడం, చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వడం, అధిక వేగం మొదలైనటువంటి ప్రమాదాల కారణమవుతున్న వాహనదారుల నిర్లక్ష్య చర్యల పట్ల పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలంతా సహకరిస్తూ నిర్లక్ష్య వైఖరిని వీడి అవగాహనతో మెలిగి రోడ్డు నియమాలు పాటించాలని కోరారు.

# ప్రభుత్వ ఖాజీ రషీద్ ను అభినందించిన ఎమ్మెల్యే సౌమ్య

- కంచికచర్ల మండల ప్రభుత్వ ఖాజీగా షేక్ అబ్దుల్ రషీద్ నియామకం



**నందిగామ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** కంచికచర్ల మండలమునకు ప్రభుత్వ ఖాజీగా నియమితులైన షేక్ అబ్దుల్ రషీద్ మంగళవారం మైనారిటీ మరియు కూటమి నేతలతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి షేక్ అబ్దుల్ రషీద్ ను శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రభుత్వ ఖాజీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మైనారిటీ సోదర సోదరీమణుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసి, వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని ఆమె ఆకాంక్షించారు. మైనారిటీల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న పథకాలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేసే దిశగా ఖాజీ ముందుండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ కరిముల్లా, ఏఎంసీ రాము,షేక్ కమల్ పాషా, మహమ్మద్ నజీర్ ,షేక్ మౌలాలి ,షేక్ అబ్దుల్ రెహమాన్ ,షేక్ రెహమాన్ ,మైనారిటీ ఓ బి సి నాయకులు మహమ్మద్ ఇక్బాల్, షేక్ ఇమామ్ జానీ, సయ్యద్ అసిన్ భాష కూటమి నాయకులు, మైనారిటీ ప్రముఖులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి గణిత పోటీల్లో 'శ్రీ శారద పాఠశాల' విద్యార్థుల విజయవిహారం!

**ఏలూరు, ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** చిన్నారుల మేధస్సుకు పదును పెడుతూ, ఏలూరులోని గుడ్ న్యూస్ స్కూల్ వేదికగా నిర్వహించిన "రాష్ట్ర స్థాయి అబాకస్ & వేదిక్ మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ -- 2026" అత్యంత ఘనంగా ముగిసింది. మెమరీ మ్యాథ్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 35కు పైగా పాఠశాలల నుండి సుమారు 700 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటారు.

**మెరిసిన నూజివీడు ఆణిముత్యాలు:** ప్రతిష్టాత్మక పోటీల్లో నూజివీడులోని 'శ్రీ శారద పాఠశాల' విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. మొత్తం 16 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా, పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ పోటీల్లో వి. గౌతమ్ (1వ తరగతి): ప్రీ లెవెల్ – 1 విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకుని గోల్డ్ మెడల్/షీల్డ్ సాధించాడు. కె. హవీన్: తన ప్రతిభతో కన్సోలేషన్ బహుమతిని సొంతం చేసుకున్నాడు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి వారి కృషిని అభినందిస్తూ సంస్థ ప్రతినిధులు షీల్డ్ మరియు సర్టిఫికేట్‌లను అందజేశారు.

**అభినందనల జల్లు:.** రాష్ట్ర స్థాయిలో పాఠశాల పేరును నిలబెట్టిన విద్యార్థులను కళాశాల చైర్మన్ కుప్పాల శంకర్, కరస్పాండెంట్ రాధిక, ప్రిన్సిపాల్ యం. ఇశ్రాయేలు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఈ విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.



# ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేసిన బీసీ సెల్ నాయకులు



**కంకిపాడు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కంకిపాడు మండలం తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడిగా బొర్ర వెంకట్ ను ప్రకటించినందుకు, నియోజకవర్గంలో బీసీ సెల్ లో పదవులు కేటాయించడంతో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కు నియోజవర్గ బీసీ సెల్ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు మరియు యువనాయుకులు బోడే వెంకట్ రామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బిసి కులాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేయాలని, నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసే విధంగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు సంగేపు రంగారావు గారు, అనుమోలు ప్రభాకర్ రావు , కోయ ఆనంద , తుమ్మలపల్లి హరికృష్ణ , చిట్టూరి నాగేశ్వరరావు ,కొనతం సుబ్రమణ్యం ,గోగినేని రమణా , ముసి బోయిన బాబు, నాగరాజు, సురేష్, సలీం, తదితర నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ వేణుతల కాటమరాజు గంగాభవాని దేవాలయాల ఆధ్యాత్మిక అభివృద్ధికి కృషి చేస్తా..

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ యాదవ్.



**మార్కాపురం,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** మార్కాపురం జిల్లా, యర్రగొండపాలెం నియోజకవర్గం, పెద్దారవీడు మండలంలో శ్రీ వేణుతల కాటంరాజు గంగాభవాని జయంతి వైభవంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. స్వామివారిని భక్తిభావంతో దర్శించుకున్న డాక్టర్ బాలాజీ గుడి అభివృద్ధి, సౌకర్యాల పెంపొందింపు గురించి స్థానిక నాయకులు, భక్తులతో వివిధ అంశాలపై చర్చించారు. ఆధ్యాత్మిక కేంద్రంగా మారేలా గుడి అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజలు, భక్తులు గొప్ప ఆనందాన్ని అనుభవించారు. టూరిజం, ఆధ్యాత్మిక అభివృద్ధికి డాక్టర్ నూకసాని బాలాజీ కృషి అభినందనీయం. ఈ కార్యక్రమం లో గుడి చైర్మన్ గుమ్మ గంగరాజు యాదవ్, ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్మెంట్ డైరెక్టర్ నక్కాశ్రీను, మూఢమంచు కొండగూరవయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ పాముల పెద్దిరాజు, గంగుల యలయ్య, తోకల యల్లయ్య, పాముల పోలురాజు, గోసు సుబ్బారావు యాదవ్, రాజేశ్వరి రెడ్డి, గాలయ్య, పాలంకయ్య, నాలి శ్రీను, రాగాల ఈశ్వర్ కుమార్, గొర్ల రామయ్య, చేతుల నాగరాజు, ఆవులరాజు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వనాధపల్లి నాంచారమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్ష



**కోడూరు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** విశ్వనాధపల్లి అద్దంకి నాంచారమ్మ జాతర ఏర్పాట్లపై మంగళవారం ఆలయ ప్రాంగణంలో అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్చి 03 తేదీన జరిగే ప్రధాన జాతరకు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, దేవదాయశాఖ, పోలీసు శాఖలు పటిష్టమైన బందోబస్తు, తాగునీరు, మరుగుదొడ్లు, క్యూలైన్ల ఏర్పాట్లను చేస్తున్నట్లు ఎంపీడీవో సుధా ప్రవీణ్ వెల్లడించారు. వివిధ శాఖ అధికారులు ఆలయ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పులివెందుల చేరుకున్న వైసీపీ అధినేత జగన్

**అమరావతి,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పర్యటన ప్రారంభించారు. ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలు తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగుతోంది. ఇందులో భాగంగా ఆయన ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. ఈ రోజు (మంగళవారం) పులివెందుల చేరుకున్న జగన్‌కు పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు.

# స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాలు విద్యాదాతలకు అందజేత



**గిద్దలూరు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణంలోని విద్యాదాతలకు స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాలను విద్యాదాతలకు అందించారు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి భారతరత్న ఇవ్వాలనే సంకల్పంతోటి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు తెలిపారు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి ని అధికారికంగా ప్రకటించాలి అదేవిధంగా భారత ప్రభుత్వం భారతరత్న కూడా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు మీద ప్రకటించాలని కోరారు ఈ సందర్భంగా ప్రతి పౌరురాలు ప్రతి పౌరుడికి ప్రతి చిన్నారులకి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్ర యొక్క గొప్పతనాన్ని ఆయన ధైర్యాన్ని ఆయన సాహసాన్ని ప్రతి స్కూలుకు స్కూలు ద్వారా విద్యార్థిని విద్యార్థులకు ఆయన చరిత్రను అందజేయాలనేటువంటి ఉద్దేశంతోటి గిద్దలూరు తాలూకాతో పాటు బద్వేల్ తాలూకాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు డిగ్రీ కళాశాలకు ఇంటర్మీడియట్ కళాశాలలకు ఆ పై స్థాయి కళాశాలలో అన్నిటికీ కూడా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటం అందించాల్సిన బాధ్యత మమ్ములను గుర్తుచేశాయన్నారు అటువంటి ఆలోచనలో భాగంగా ఈరోజు గిద్దలూరు లోని సూర్య విద్యానికేతన్ యజమానులు దప్పిలి బ్రహ్మానంద రెడ్డి కి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి కి స్ప్రింగ్ బోర్డ్ ప్రిన్సిపాల్ , సెయింట్ పాల్ ప్రధానోపాధ్యాయులు చల్ల రమేష్ కి వినూత్న స్కూల్ ప్రిన్సిపల్ ఖాజావలికి అరుణోదయ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ కి ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘసేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ గిద్దలూరు వారు వాసవి జాగృతి మిత్రమండలి క్లబ్ అధ్యక్షుడు శివపురం హరికృష్ణ గ్రంథాలయం అభివృద్ధి కార్యదర్శి ఎస్ డి ఫరూక్ సంబంధిత స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు

# భారత్--బల్గేరియా పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూపు సభ్యునిగా సానా సతీష్ బాబు



**కాకినాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** 18వ లోక్‌సభ కాలానికి సంబంధించి భారత పార్లమెంట్‌లో బల్గేరియాతో పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూపు ఏర్పాటు చేయబడింది. రెండు దేశాల మధ్య పార్లమెంటరీ సంబంధాలను బలోపేతం చేయడం, పరస్పర అవగాహనను పెంపొందించడం,ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించడం ఈ గ్రూపు ప్రధాన ఉద్దేశ్యం. లోక్‌సభ స్పీకర్ సానా సతీష్ బాబును భారత్--బల్గేరియా పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూప్ సభ్యునిగా నామినేట్ చేశారు. ఈ నియామకం ద్వారా భారత్, బల్గేరియా దేశాల మధ్య పార్లమెంటరీ స్థాయిలో సత్సంబంధాలు మరింత బలపడనున్నాయి.

# విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ...



**గుడ్లవల్లేరు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ఘంటా నేతాజీ వర్ధంతి సందర్భంగా గుడ్లవల్లేరు శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో ఆయన చిత్రపటానికి మంగళవారం పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులందరికి నేతాజీ కుమారుడు కష్ణప్రసాద్ ఆర్థిక సహకారంతో నోట్‌బుక్స్, పలకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి విద్యానికేతన్ అధినేత సింగంశెట్టి ఆదినారాయణ(చినమాస్టారు), విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# చర్మకారులకు గహాలను నిర్మించాలి...



**గుడ్లవల్లేరు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ఇళ్లు లేనటువంటి చర్మకారులకు గహాలను నిర్మించాలని ఎస్సీ, ఎస్టీ చర్మకారుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుల్లా త్యాగరాజు(కింగ్) డిమాండ్ చేశారు. ఈ విషయమై గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎండీ ఇమ్రాన్, గహ నిర్మాణ ఏఈ ఆలపాటి సురేంద్రకు వినతి పత్రాన్ని అందించారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో అర్హులైన వారికి ప్రభుత్వ పెన్షన్ మంజూరు చేసి ఇవ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల నుంచి లిడ్‌క్యాప్ రూ.200కోట్లను ప్రభుత్వం మంజూరు చేసేంత వరకు తాము ఈ వినతులను అందిస్తూనే...ఉంటామన్నారు. ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొడక్షన్ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ బుల్లా రాజారావు ఆదేశాల మేరకు ఈ వినతుల్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. దళిత మాదిగ సామాజిక వర్గానికి చెందిన కళాకారులను ద్వారా గుర్తించి ఈ మండలంలోని 22పంచాయతీల్లో మాదిగ బిడ్డలు అర్హులైన వారిని డప్పు కళాకారులు, చర్మ కళాకారులు, చెప్పులు కుట్టేవారిని, గుర్తించి లిడ్‌క్యాప్ ద్వారా ఒక్కో మనిషికి రూ.2లక్షల లోన్స్ రూపంలో ఇవ్వాలని కోరారు.

# దశబ్దాల కళ నెరవేర్చిన మంత్రివర్యులు కొలుసు పార్ధసారధి

- రూ.1.50.కోట్లతో సిలువగట్టు రహదారి నిర్మించి క్రైస్తవ సోదరుల కళ నెరవేర్చిన మంత్రివర్యులు కొలుసు పార్ధసారధి




**నూజివీడు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** మాట ఇచ్చారంటే నెరవేరుస్తారు అంతే ఆయనే రాష్ట గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు కొలుసు పార్ధసారధి. నూజివీడు పట్టణంలో క్రైస్తవుల ఆరాధ్య దైవం క్రీస్తు తల్లి అయిన మరియమ్మ గారి పుణ్యక్షేత్రం సిలువ గట్టు పుణ్యక్షేత్రానికి వేలాది భక్తులు వచ్చి పూజలు చేసుకుంటారు. ఏడాదికి ఒక్క సారి 3 రోజులు తిరునాళ్ళు రంగ రంగ వైభవంగా జరుపుకుంటారు. అయినా సరైన రహదారి లేదు. గత సంవత్సరం తిరునాళ్ళలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రివర్యులకు క్రైస్తవ పెద్దలు. బోధకులు రహదారి గూర్చి అడుగగా వచ్చే ఏడాదికి పూర్తిచేసి క్రైస్తవ సోదరులకు బహుమతిగా ఇస్తానని.భక్తులంతా మరింత సౌకర్యంగా ఉత్సవాలు చేసుకోవచ్చని చెప్పిన మాట ప్రకారం. ఏడాది గడవక ముందే మాట నిలబెట్టుకుని తన సహృదయం, సేవా తత్వం, ప్రజా సేవలో మాట నిలబెట్టుకునే తత్వం చూసి నూజివీడు నియోజకవర్గ క్రైస్తవ సోదరులు అంతా తమ కృతజ్ఞతను,ఆనందాన్ని సంతోషాన్ని, వ్యక్తం చేస్తున్నారు. ప్రజా నాయకుడు, ప్రజా ప్రతినిది అంటే కొలుసు పార్ధసారధి లాగానే ఉండాలని క్రైస్తవ సోదరులంతా ముక్తకంఠంతో తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# ఆపన్నులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిది-ఎమ్మెల్యే బోడె ప్రసాద్



**కంకిపాడు/ పెనమలూరు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో తోడ్పాటునిస్తుందని శాసనసభ్యులు బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు నియోజకవర్గం, ఉయ్యూరు మండలం ఉయ్యూరు గ్రామానికి చెందిన ఆరేపల్లి నవీన్ తల్లిదండ్రులు కోల్పోవడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ఐదు లక్షల చెక్కును రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కృష్ణా జిల్లా టిడిపి అధ్యక్షులు వీరంకి గురుమూర్తి అందజేశారు. నియోజకవర్గానికి ముఖ్యమంత్రి సహాయ నిధులు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గానికి 13 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధులు తీసుకురావడంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కృషి అభినందనీయమని గురుమూర్తి అన్నారు.

# ప్రాధాన్యతా క్రమంలో రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం - ఎమ్మెల్యే బోడే ప్రసాద్



**పెనమలూరు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం స్థానిక తాడిగడప మున్సిపాలిటీ యనమలకుదురు గ్రామంలో ఆయన పర్యటించారు. ఆదివారం లిబ్రా కాలనీ, వెలగపూడి రామకోటయ్యకాలనీలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు స్థానిక ప్రజలు, మహిళలు పలు సమస్యలను ఆయన దృష్టకి తీసుకువచ్చారు. దీనిలో భాగంగా మంగళవారం నీలం సంజీవ్ రోడ్డును స్థానిక అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాన పనులు ప్రారంభించడానికి అవసరమయ్యే నిధుల కేటాయింపునకు కౌన్సిల్‌లో ప్రవేశపెట్టి త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు వచ్చేలా ప్రయత్నం చేస్తానని స్థానికులకు హామి ఇచ్చారు. ముప్పవరపు రామయ్య, జానకమ్మ వీధుల రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా టెండర్లు ఆహ్వానించామని, నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188

# తొలగనున్న జవహర్ నగర్.... అదనపు డంపింగ్ భారం

**మినీ డంపింగ్ యార్డ్ల కోసం ప్రభుత్వం వేట.**



**జవహర్ నగర్ ఫిబ్రవరి 24: (వార్తా ప్రభ)**గ్రేటర్ మున్సిపాలిటీల విలీనం చివరకు జవహర్ నగర్ పాలిట శాపంగా పరిగణించింది. హైదరాబాద్ సిటీ నుండి రోజుకు దాదాపుగా 8 వేల మెట్రిక్ టన్నుల చెత్త జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కు చేరుతుండగా... కొత్త ప్రాంతాల నుండి వస్తున్న 1500 టన్నుల అదనపు భారంఈ జవహర్ నగర్ ను ఊపిరి తీసుకోనివ్వడం లేదని జవహర్ నగర్ వాసులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నరకం నుండి జవహర్ నగర్ వాసులకే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలైన దమ్మాయిగూడ, నాగారం, అహమ్మద్ గూడా, చీర్యాల్, తదితర ప్రాంతాల ప్రజలకు విముక్తి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం వికేంద్రీకరణ బాట పట్టింది. శివారు ప్రాంతాల్లో కొత్త డంపింగ్ యార్డ్ ల కోసం వేట మొదలు పెట్టింది.

# మల్కాజిగిరి షీ టీమ్స్ కఠిన చర్యలు..

**.15 రోజుల్లో పట్టుబడ్డ 130 ఈవ్‌టీజర్లు.**



**ఎల్బీనగర్/ వార్తప్రభ (ఫిబ్రవరి 24):**మల్కాజిగిరి కమిషనరేట్‌లో మహిళల భద్రతపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు డీసీపీ ఉమెన్ సేఫ్టీ శ్రీమతి టి. ఉషారాణి తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు షీ టీమ్స్ 130 మందిని (102 పెద్దలు, 28 మైనర్లు) ఈవ్‌టీజింగ్ కేసుల్లో పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కాలంలో మొత్తం 148 ఫిర్యాదులు అందాయి.ఫోన్ కాల్స్ ద్వారా 41, సోషల్ మీడియా ద్వారా 33, ప్రత్యక్ష వేధింపులపై 74 ఫిర్యాదులు నమోదయ్యాయి. 6 క్రిమినల్ కేసులు నమోదు చేసి, 30 పెటీ కేసులు బుక్ చేశారు. 99 మందికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు.బస్ స్టాప్‌లో అసభ్య ప్రవర్తన, ప్రేమ పేరుతో వేధింపులు, ప్రైవేట్ ఫోటోలతో బెదిరింపులు వంటి కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.ఈ నెలలో 58 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 9,205 మందికి మహిళల హక్కులపై చైతన్యం కల్పించారు.మహిళలు వేధింపులకు గురైతే 8712662111 వాట్సాప్ నంబర్ లేదా స్థానిక షీ టీమ్ నంబర్లకు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

## బోరంపేటలో ఘోరం: రెండు నెలల పసికందును నిప్పంటించి చంపిన కన్నతల్లి!

**డైల్ 100 కాల్‌తో వెలుగులోకి వచ్చిన దారుణం.**
**బాబు ఏడుస్తున్నాడని తట్టుకోలేక నిప్పు పెట్టిన మమత.లి**
**మధ్యప్రదేశ్ వలస కూలీల కుటుంబంలో విషాదం..**
**విచారణలో దుండిగల్ పోలీసులు.**



**దుండిగల్/బోరంపేట, ఫిబ్రవరి 24, (వార్తాప్రభ) :**కన్నతల్లి ప్రేమను మరిచి, కసాయిగా మారిన ఒక తల్లి దారుణానికి రెండు నెలల పసికందు బలైపోయింది. బాబు ఏడుస్తున్నాడని, తనను ఇబ్బంది పెడుతున్నాడనే నెపంతో అక్కున చేర్చుకోవాల్సిన తల్లే ఆ పసి ప్రాణాన్ని నిప్పంటించి బలి తీసుకుంది. ఈ విషాదకర సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోరంపేట సనారెల్లి అపార్ట్‌మెంట్స్ కన్స్ట్రక్షన్ సైట్‌లో మంగళవారం వెలుగు చూసింది.

**అసలేం జరిగింది?**మధ్యప్రదేశ్ రాష్ట్రం సాగర్ జిల్లా, నవ్వగవ గ్రామానికి చెందిన రాజేంద్ర ఆదివాసీ (21) తన భార్య మమత అహిర్వార్ (20) మరియు రెండు నెలల కుమారుడితో కలిసి బోరంపేటలోని సనారెల్లి అపార్ట్‌మెంట్స్ నిర్మాణ పనుల్లో లేబర్‌గా పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నాడు. మంగళవారం ఉదయం రాజేంద్ర పని నిమిత్తం బయటకు వెళ్ళాడు. మధ్యాహ్నం 11 గంటల సమయంలో తిరిగి గదికి వచ్చి చూసేసరికి, మమత తన సొంత కొడుకునే నిప్పు పెట్టి కాల్చడం చూసి నిర్ఘాంతపోయాడు. రాజేంద్ర వెంటనే భార్యను పక్కకు నెట్టి బాబును కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ, అప్పటికే ఆ పసికందు మంటల్లో కాలి విగతజీవిగా పడి ఉన్నాడు.

**పోలీసుల రంగప్రవేశం** ఈ దారుణంపై రాజేంద్ర 'డైల్ 100'కు కాల్ చేయగా, దుండిగల్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితురాలు మమతను విచారించగా, బాబు ప్రతిరోజూ ఏడుస్తూ తనను ఇబ్బంది పెడుతున్నాడని, అందుకే ఆ అడ్డంకిని తొలగించుకోవాలని ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తేలింది. తండ్రి రాజేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# నేరస్తుల గుండెల్లో వణుకు!!

**● బాధితులకు భరోసా ● మహిళల భద్రతే ప్రాధాన్యత ● పెండింగ్ కేసులకు చెక్ ● సాంకేతికతతో నేర నియంత్రణ ● పరీక్షల వేళ పటిష్ట బందోబస్తు ● ప్రజల నమ్మకమే పోలీసుల బలం ● రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**నేరస్తుల గుండెల్లో వణుకు, బాధితులకు భరోసా కల్పించడమే పోలీస్ కర్తవ్యం అని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఈ మేరకు మంగళవారం సిపి కార్యాలయంలోని కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన జనవరి నెలవారీ నేర సమీక్షా సమావేశంలో మహిళల భద్రత, నేరాల నియంత్రణపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల అధికారులతో సమీక్షించిన సీపీ, పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులు, పోక్సో, గంజాయి, ఆస్తి నేరాల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళలపై జరిగే నేరాల్లో పక్కా సాక్ష్యాధారాలు సేకరించి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని, ఎస్సీ/ఎస్టీ కేసుల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణతో పాటు వీడియో రికార్డింగ్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. గంజాయి అక్రమ రవాణా, రౌడీషీటర్ల ఆగడాలపై ఉక్కుపాదం మోపాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు "అరైవ్--అలైవ్" కార్యక్రమాలతో పాటు ప్రమాదాల విశ్లేషణ చేయాలని, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేసి ప్రజల్లో భరోసా కల్పించాలని పేర్కొన్నారు. రాబోయే 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల దృష్ట్యా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేస్తూ, ప్రశ్నపత్రాల తరలింపులో పటిష్ట భద్రత కల్పించాలని సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రతి శనివారం కోర్టు సంబంధిత అంశాలపై సమీక్షించి కన్విక్షన్ రేటు పెంచాలని, సాంకేతికతను జోడించి నేర రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సీపీ అంబర్ కిషోర్ ఝా ఈ సమావేశంలో దిశానిర్దేశం చేశారు.

# ప్రకృతి రంగులతోనే పండగ!!

**● పర్యావరణ స్పృహ - సామాజిక బాధ్యత ● మనో చైతన్య విద్యార్థుల అద్భుత సృజన ● పూలతో రంగుల తయారీ ప్రదర్శన ● దివ్యాంగన్ విద్యార్థుల నైపుణ్యానికి జేజేలు ● బాటనీ విభాగం, ఎకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకో క్లబ్, బాటనీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో హోలీ పండుగను పురస్కరించుకొని 100% ప్రకృతి సిద్ధమైన రంగుల వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓజా అధ్యక్షత వహించగా, మనో చైతన్య వికలాంగుల శిక్షణా కేంద్రం విద్యార్థులు, ఎడ్యుకేటర్లు స్వర్ణలత, మంజుల పూలతో రంగుల తయారీ విధానాన్ని వివరించారు. ప్రకృతికి హాని కలిగించని రంగుల ప్రాముఖ్యతను తెలుపుతూనే, దివ్యాంగన్ విద్యార్థులు తయారు చేసిన వివిధ నిత్యవసర వస్తువుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సదస్సులో పెద్దపల్లి మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సాంబశివరావు, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ జి. సుబ్బారావు, డాక్టర్ శారద, డాక్టర్ కిరణ్మయి, పి. శ్రీదేవి, బి. తిరుపతి తదితరులు పర్యావరణ హితమైన హోలీ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. డాక్టర్ జి. రామకృష్ణ, మెంటర్ ఉషారాణి, డాక్టర్ వి. నరేష్, ప్రత్యూష, సుమలతతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని రంగుల తయారీలోని మెళకువలను నేర్చుకున్నారు. సామాజిక బాధ్యతతో పాటు పర్యావరణ స్పృహను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. దివ్యాంగన్ విద్యార్థుల ప్రతిభను, వారి స్వయం ఉపాధి నైపుణ్యాలను ప్రిన్సిపాల్ ఓజా ప్రత్యేకంగా అభినందించారు. ఈ వినూత్న ప్రయోగం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చని అధ్యాపక బృందం అభిప్రాయపడింది. అంతిమంగా, రసాయన రంగులకు స్వస్తి పలికి ప్రకృతి రంగులతోనే పండుగ జరుపుకోవాలని ప్రతిజ్ఞ చేయడంతో కార్యక్రమం ముగిసింది.

## సీఎం సహాయనిధి పేదలకు కొండంత అండ: కొలన్ హన్మంత్ రెడ్డి

**● జగద్గిరిగుట్ట వాసికి రూ. 2,00,000/- ఎల్వోసీ మంజూరు. ● మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో బాధితురాలికి భరోసా. ● వెంటనే స్పందించి మానవత్వం చాటుకున్న హన్మంత్ రెడ్డి.**



**కుత్బుల్లాపూర్/బాచుపల్లి, ఫిబ్రవరి 24, (వార్తాప్రభ) :**ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక గొప్ప వరమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్‌కు చెందిన రామోజు లక్ష్మి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో, శస్త్రచికిత్సకు అవసరమైన ఖర్చుల కోసం బాధితులు హన్మంత్ రెడ్డిని ఆశ్రయించారు.

**మంత్రి సహకారంతో తక్షణ సాయం** బాధితుల పరిస్థితిని చూసి చలించిన హన్మంత్ రెడ్డి, వెంటనే రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. మంత్రి సహకారంతో బాధితురాలి శస్త్రచికిత్స నిమిత్తం రూ. 2,00,000/- విలువైన సీఎం సహాయనిధి ఎల్వోసీని మంజూరు చేయించారు. బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ మంజూరు పత్రాలను బాధితురాలి ప్రతినిధి అనంత్ చారికి అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఆపదలో ఉన్న ప్రతి పేద కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, ఎల్లయ్య మరియు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సందర్శకులను ఆకట్టుకుంటున్న ఖాదీ మహోత్సవం 2026





**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ):**మాదాపూర్ లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఖాదీ మహోత్సవం--2026 సందర్శకులను ఆకట్టుకుంటోంది. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన ఖాదీ, చేనేత, హస్తకళా ఉత్పత్తులు ప్రదర్శనలో ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. వావిలాల ఖాదీ ఉత్పత్తులు, గుజరాత్ పటోళ్ల చీరలు, బనారస్ పట్టు చీరలు, కర్ణాటక ఖాదీ దుస్తులు, తోలు వస్తువులు, కలంకారీ డ్రెస్ మెటీరియల్స్ వంటి ఉత్పత్తులు కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి.సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.గురువు ప్రశాంత్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం విశేషంగా మెప్పించింది. నర్తన గణపతిమ్, అంబాష్టకం, జతిస్వరం, తరంగం, శబ్దం, భామాకలాపం, భో శంభో, ముద్దుగారే యశోద, కంజదళయాదాక్షి, అఖిలాండేశ్వరి అంశాలను గురువు ప్రశాంత్‌తో పాటు అద్వైత, మీనాక్షి, తేజస్విని, గమన, స్నిగ్ధ, సహస్ర, హిమబిందు సమర్థంగా ఆవిష్కరించారు. కార్యక్రమానికి వచ్చిన సందర్శకులు కళాకారులను అభినందించారు.

## ఈరోజు నుంచి ఇంటర్ పరీక్షలు... రాష్ట్రవ్యాప్తంగా 9.97 లక్షల మంది హాజరు.

**తెలంగాణ ఇంటర్ బోర్డు కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ జయప్రదాభాయ్.**



**ఎల్బీనగర్/ ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**టిజిబిఐఈ ఆధ్వర్యంలో ఈరోజు నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జయప్రదాభాయ్ తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఫస్ట్ ఇయర్ జనరల్ మరియు ఒకేషనల్ కలిపి బాలురు 2,40,014 మంది, బాలికలు 2,49,112 మంది ఉన్నారు. సెకండ్ ఇయర్ జనరల్ డ ఒకేషనల్ కలిపి బాలురు 2,53,900 మంది, బాలికలు 2,54,049 మంది పరీక్షలు రాయనున్నారు.మొత్తం 1,495 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి, రెవెన్యూ, పోలీస్, మెడికల్, విద్యుత్ శాఖల సమన్వయంతో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

వార్తా ప్రభ
హైదరాబాద్

# ప్రాణ రక్షణే లక్ష్యం!!

**● "అరైవ్-అలైవ్"తో వాహనదారుల్లో చైతన్యం ● చలాన్ల కోసం కాదు.. ప్రాణాల కోసం హెల్మెట్ ధరించండి ● కుటుంబాల భవిష్యత్తు కోసం ట్రాఫిక్ నిబంధనలు పాటించండి ● సీపీ అంబర్ కిషోర్ ఝా**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**చలాన్ల కోసం కాదు.. ప్రాణాల కోసం హెల్మెట్ ధరించండి అని వాహనదారులకు సీపీ అంబర్ కిషోర్ ఝా పలు ట్రాఫిక్ అలాగే రోడ్ సేఫ్టీ సూచనలు చేశారు. ఈ మేరకు మంగళవారం గోదావరిఖని మున్సిపల్ టీ జంక్షన్ వద్ద "అరైవ్--అలైవ్" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన సదస్సులో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించిన వాహనదారులకు పుష్పాలు ఇచ్చి అభినందించగా, హెల్మెట్ లేని వారికి ఉచితంగా హెల్మెట్‌లు పంపిణీ చేసి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి నెల చివరి వారంలో నిర్వహించే ఈ రెండవ విడత కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ......పోలీసులు విధించే చలాన్ల కంటే ప్రాణ రక్షణే ముఖ్యమని, ప్రమాదాల వల్ల కుటుంబాలు రోడ్డున పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కేవలం హెల్మెట్ పెట్టుకోవడమే కాకుండా సేఫ్టీ లాక్ కూడా బిగించాలని, తమ బంధుమిత్రులకు కూడా దీనిపై అవగాహన కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, ఏసీపీలు రమేష్, శ్రీనివాస్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొని వాహనదారులను చైతన్య పరిచారు. ప్రాణ భద్రత కోసం హెల్మెట్ వాడకం ఒక సామాజిక బాధ్యతగా ప్రతి వాహనదారుడు గుర్తించాలని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# రామగుండంలో రీ-పోలింగ్ జరపాల్సిందే!!

**● 43 డివిజన్లలో ఫలితాలు తారుమారు? ● కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా మారిన అధికారులు ● కలెక్టరేట్ మెట్లెక్కిన మాజీ ఎమ్మెల్యే చందర్**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 24 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమాలకు పాల్పడిందని, వెంటనే 43 డివిజన్లలో రీ-పోలింగ్ నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసిన ఆయన, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ తన పదవిని అడ్డం పెట్టుకుని బిఆర్ఎస్ నాయకులను బెదిరించడమే కాకుండా అధికారులతో కలిసి ఎన్నికల అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. ముఖ్యంగా స్ట్రాంగ్ రూమ్ వద్ద విద్యుత్ నిలిపివేసిన సమయంలో బ్యాలెట్ బాక్సులను తారుమారు చేశారని, ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసినా ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా రావడంపై తమకు బలమైన అనుమానాలు ఉన్నాయని ఆయన తెలిపారు. అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లా యంత్రాంగం స్పందించకుంటే రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నారాయణదాసు మారుతి, ఉప్పు రాజ్ కుమార్ తదితరులు పాల్గొని ఎన్నికల ప్రక్రియలో జరిగిన అన్యాయంపై నిరసన వ్యక్తం చేశారు.

## చంపాపేట్‌లో కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్పందన .



**ఎల్బీనగర్)వార్తప్రభ(ఫిబ్రవరి 24):**చంపాపేట్ డివిజన్‌లోని దుర్గానగర్, శ్రీనిధి కాలనీల వాసులు పలు సమస్యలపై ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిన ని మర్యాదపూర్వకంగా కలిశారు. డ్రైనేజ్ లైన్ విస్తరణ, కొత్త మ్యాన్‌హోల్స్ నిర్మాణం, సీల్ట్ తొలగింపు, 60 ఫీట్ల వాటర్‌లైన్ మంజూరు, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు, ప్రధాన ద్వారం వద్ద అనవసర స్తంభాల తొలగింపు వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.